# విషయసూచిక





బాల్య వివాహాలు,
వాటిని అరికట్టడానికి చర్యలు — 4



బాల కార్మిక వ్యవస్థ - నిరోధం — 19




విద్య- ప్రాధాన్యత,
సార్వత్రిక పాఠశాల — 31

## కౌమారప్రాయం అంటే ఏమిటి?

**కౌమారప్రాయంలో ఉన్న వ్యక్తి అంటే "బాల్యం నుండి వయోజనులుగా అభివృద్ధి చెందే దశలో ఉన్న యువతి/యువకుడు". "శారీరక పెరుగుదల, వికాసం వేగవంతంగా జరిగే దశ"గా కౌమారప్రాయాన్ని నిర్వచించారు. శారీరక, సాంఘిక, మానసిక పరిపక్వత; లైంగిక పరిపక్వత వికసించే దశ కౌమారం. ఇది ప్రయోగాల దశ. వయోజన మానసిక ధోరణుల దిశగా వికాసం చెందే దశ. బాల్యదశ నుండి సాపేక్ష స్వాతంత్ర్య దిశగా వృద్ధి చెందే దశ.**

### కౌమారప్రాయంలోని వారిపై ప్రత్యేక శ్రద్ధ ఎందుకు అవసరం?

కౌమారప్రాయం అతి ముఖ్యమైన ఎదిగే దశ. 9 /10 సంవత్సరాల నుండి 18/ 19 సంవత్సరాల వరకు ఈ దశను పేర్కొనవచ్చు. దీన్ని రెండు భాగాలుగా విభజించవచ్చు.

- **కౌమారప్రాయపు మొదటి దశ (9/10 సం. నుండి 14/15 సం. వరకు)**
- **కౌమారప్రాయపు రెండవ దశ (16 సం. నుండి 18/19 సం. వరకు)**

వచ్చే రెండు దశాబ్దాల్లో కౌమారప్రాయంలోని వారి సంఖ్యతో పాటు మొత్తం జనాభాలో వారి శాతం కూడా గణనీయంగా పెరగనుంది. దీనికి కారణాలు ఎనభైల్లో సంతానోత్పత్తి అత్యధికంగా ఉండడం, తొంభైల్లో జనాభా ఊపందుకోవడం. ఈ వయోబృందంలో వ్యాధులు ప్రబలే శాతం, మరణాల శాతం తక్కువ కాబట్టి కౌమారప్రాయంలోని వారిపై శ్రద్ధ పెట్టడంలేదు. సంతానోత్పత్తి వయసులోనివారిలో కౌమారప్రాయంలోని వారే అధికభాగం ఉంటారు కాబట్టి భారతదేశం యొక్క భవిష్యత్తు జనాభా పరిమాణం, వృద్ధి వీరిపైనే ఆధారపడి ఉంటుంది. అందువల్ల వీరిపై ప్రత్యేక దృష్టి పెట్టడం అవసరం.

వీరిపై దృష్టి పెట్టడం దేశ సాంఘికార్థిక అభివృద్ధికి ఊతం ఇస్తుంది. అంతేకాకుండా సాంఘిక సామరస్యం, లింగ సమానత్వం, జనాభా స్థిరీకరణ, ప్రజల జీవనప్రమాణాల పెంపు వంటి సామాజిక అంశాలకూ దారితీస్తుంది.

కౌమారప్రాయంలోనివారు తరచుగా వివిధ సమస్యలు, అలజడులు, తిరుగుబాటుధోరణులతో ఉంటారు.


వారి బెంగ అంతా 'అన్ని తప్పులను ఒప్పుగా చేయడం', 'న్యాయం కోసం పోరాటం', 'సరైనదే చేయడం' పైనే. సమాజానికి ఉపయోగపడే, సమాజ ఉత్పాదకతకు దోహదం చేసే, భాగస్వామ్యపౌరులుగా గుర్తింపు పొందాలనే కోరిక వారిలో ఉంటుంది.



వయోజనులుగా ఎదిగే దశలో కౌమారప్రాయంలోని వారికి అనేక సమస్యలుంటాయి. వీటిని గుర్తించి, భావి తరాల జీవితం సుగమమయ్యేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజం సహకరించాలి.

పిల్లలు, కౌమారప్రాయంలోనివారు అనేక సాంఘిక వేధింపులకు, దురాచారాలకు బాధితులయ్యే అవకాశం ఉంది. బలవంతపు బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాలు, లింగ వివక్ష వీటికి ఉదాహరణలు. వీటిలో బాల్యవివాహాలు భారతదేశంలోనూ, ప్రపంచంలోని ఇతర ప్రాంతాల్లోనూ కౌమారప్రాయంలోని వారి అభివృద్ధిని నిరోధిస్తున్నాయి.

# బాల్య వివాహాలు -
# అరికట్టేందుకు చర్యలు



## బాల్య వివాహాలు- అరికట్టేందుకు చర్యలు

భారతదేశ సాంస్కృతిక విలువల్లో, సమాజ నిర్మాణంలో అంతర్భాగంగా ఉండి సమాజాన్ని అతలాకుతలం చేస్తున్న సమస్య బాల్యవివాహాలు. దేశంలో ఆడపిల్లలకు కనీస వివాహ వయస్సు 18గా చేస్తూ చట్టాలు రూపొందించినప్పటికీ, 15 నుండి 19 సంవత్సరాల మధ్య వయస్సువారు వివాహం చేసుకునేవారి సంఖ్యలో గణనీయంగా ఉన్నారు.

## పరిచయం

### "బాల్య వివాహం అంటే ఏమిటి?"

"18 ఏళ్లు నిండకుండానే వివాహం చేసుకోవడాన్ని లేదా కలిసిఉండడాన్ని బాల్యవివాహం అంటారు" (icrw.org నిర్వచనం ప్రకారం)

లైంగిక, బాలల హక్కుల దృక్కోణాల నుండి చూస్తే; తరానికి, తరానికి మధ్య క్లిష్టమైన సమస్య బాల్య వివాహాలు. ఒక్కరు కానీ, ఇరువురు కానీ వివాహానికి న్యాయపరంగా నిర్ధారించిన వయస్సుకు పూర్వం కలిసి ఉండడాన్ని బాల్యవివాహంగా నిర్వచించారు. భారతదేశంలో ఈ నిర్ధారిత వయస్సు బాలికలకు 18 సం., బాలురకు 21 సం (గ్రాజహీూ2006). 2005-2006 సంవత్సరంలో 20-24 సం. మధ్య వయస్సులోని మహిళల్లో 47 శాతం మందికి పైగా 18 సం. నిండకుండానే పెళ్ళి చేసుకున్నారు

**ఆంధ్రప్రదేశ్‌లో 56.3 శాతం పిల్లలు బాల్యవివాహాలు చేసుకుంటున్నారు. విశాఖపట్నంలో 18 సంవత్సరాలలోపుగా వివాహం చేసుకునే వారి సంఖ్య 57.4శాతం.**

(NFHS`3). 10–19 సం. మధ్య పిల్లల్లో 1.7 కోట్ల మంది పెళ్ళి చేసుకున్నట్టు 2011 జనాభా లెక్కల్లో తేలింది.

బాల్యవివాహాల వల్ల బాలబాలికలిరువురికీ నష్టాలున్నప్పటికీ, బాలురతో పోలిస్తే బాలికల్లోనే ఈ దుష్ప్రభావాలెక్కువ.

**చిన్న వయస్సులోనే పెళ్ళి చేసుకున్న వారిలోనే గృహహింస అధికమని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. స్థూలంగా పరిశీలిస్తే తరాల మధ్య పేదరికం అదే విధంగా ఉండేందుకు, తద్వారా సమాజంలో మహిళలను అట్టడుగు స్థాయిలో ఉంచేందుకు బాల్యవివాహాలు దోహదం చేస్తున్నాయి.**

- జీవితంలోని ప్రతి అంశంలో ఎంపిక చేసుకోవడానికి, అవకాశాలకు స్వేచ్ఛ తగ్గిపోతుంది. ఇది మొదటి దుష్ప్రభావం.
- చిన్న వయస్సులో గర్భధారణ, కుటుంబంలో ప్రధాన పాత్ర పోషించాల్సి రావడం వ్యక్తిగతంగా, సమాజపరంగా తీవ్ర నష్టాన్ని కలిగిస్తుంది. శిశు మరణాలు, బాల్య మరణాలు, పురిట్లోనే కన్నుమూయడం బాల్యవివాహాల వల్ల కలిగే దుష్ప్రభావాలు.

# భారతదేశంలో బాల్య వివాహాల సరళి, ధోరణులు

భారతదేశమంతటా బాల్య వివాహాలు అధికంగా ఉన్నాయి. 18 సంవత్సరాలు నిండని అనేకమంది బాలికలు బాల్య వివాహాలు చేసుకుంటున్నారు. బాల్య వివాహాలు అధికంగా జరుగుతున్న రాష్ట్రాలు బీహార్, రాజస్థాన్, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, మధ్య ప్రదేశ్, ఆంధ్ర ప్రదేశ్, కర్నాటక. ఈ రాష్ట్రాల్లో బాల్య వివాహాల సంఖ్య 50 శాతానికి పైగానే ఉండడం ఆందోళనకరం. రాష్ట్రంలో జిల్లాల మధ్య తేడాలు కూడా ఉన్నాయి. ఉదాహరణకు తమిళనాడులో బాల్య వివాహాలు తక్కువగా జరుగుతున్నప్పటికీ ఆ రాష్ట్రంలో ఒక జిల్లాలో బాల్య వివాహాల శాతం దేశ సరాసరి రేటుకు అతి సమీపంగా ఉంది. ('రెడ్యూసింగ్ చైల్డ్ మ్యారేజెస్ ఇన్ ఇండియా'- జ్యోత్స్న ఝా నివేదిక)

**బాలికల విద్యాస్థాయి అధికమైన కొద్దీ బాల్యవివాహాలను తప్పించుకునే అవకాశాలు పెరుగుతున్నాయి. కేవలం సెకండరీ విద్య పూర్తి చేసుకుంటున్నవారితో పోలిస్తే ఉన్నత మాధ్యమిక విద్య చదివే బాలికలు బాల్య వివాహాలను తప్పించుకునే అవకాశం ఎక్కువ.**

గత దశాబ్ద కాలంలో దేశంలో బాల్య వివాహాల శాతం తగ్గింది. కానీ ఈ తగ్గుదల 15 సంవత్సరాల లోపు బాలికల విషయంలోనే అధికంగా ఉంది. 2011 జనాభా లెక్కల ప్రకారం తొమ్మిదేళ్ల లోపు పెళ్ళయిన బాలికలెవరూ ఇప్పుడు లేరు. కానీ 15 నుండి 17 సంవత్సరాల వయసు మధ్య పెళ్ళయిన బాలికల శాతం గణనీయంగా ఉంది. వీరిలో గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణ ప్రాంతాలకు చెందిన బాలికలూ ఉన్నారు. నిరక్షరాస్యులు ఉన్నారు, ఎనిమిదో తరగతి వరకు చదివిన వారూ ఉన్నారు. కనీసం సెకండరీ స్థాయి వరకు చదువు బాల్య వివాహాలపై సానుకూల ప్రభావం చూపిస్తోంది.

10-14 సం. వారితో పోలిస్తే 15-18 సం. వారిలోనే బాల్య వివాహాల శాతం ఎక్కువ. ఈ ధోరణి దేశమంతటా కన్పిస్తోంది. బాల్య వివాహాల శాతం అధికంగా ఉన్న ఆంధ్రప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లోనూ ఈ ధోరణి ఉంది. గ్రామీణ-పట్టణ జనాభా నిష్పత్తితో పోలిస్తే 18 సం.లోగా వివాహమైన బాలికల శాతం గ్రామీణ-పట్టణ నిష్పత్తి చాలా అధికంగా ఉంది (69:31, 2011 జనాభాలెక్కలు). 15 సం.లోగా వివాహమైన బాలికల్లో 87 శాతం గ్రామీణులు; 66 శాతం నిరక్షరాస్యులు; 17 శాతం బాలికలు ఐదేళ్లు, 14 శాతం బాలికలు ఎనిమిదేళ్లు పాఠశాల విద్య పూర్తి చేసినవారు (డి.ఎల్.హెచ్.ఎస్.-3 గణాంకాలు, 2007-08).

పట్టణ ప్రాంతాల్లోని తక్కువ శాతం బాల్య వివాహాలు ఒక ప్రశ్నకు దారి తీస్తున్నాయి. పట్టణ ప్రాంతాలకు వలస వల్ల బాల్య వివాహాలకు ముగింపు పలకవచ్చా? దీనికి సమాధానం నేరుగా చెప్పలేం. దేశంలో జరిగిన ఇటీవలి పరిశోధనల ఫలితాలు దీనికి వ్యతిరేకంగా ఉన్నాయి. "ఉపాధికోసం పట్టణాలకు వలస వెళ్ళే గ్రామీణులు

వలస వెళ్ళేందుకు పూర్వమే తమ కూతుళ్లకు వివాహం చేయాలని భావిస్తున్నారు. తమ కుమార్తెల ఆహారం, రక్షణ అవసరాలు వివాహం వల్ల నెరవేరతాయని పట్టణ మురికివాడల్లో నివసించబోయే ప్రజానీకం ఆలోచిస్తోంది. ఇలాంటి సందర్భాల్లో వారి కుమార్తెలకు వివాహం చేయడమే వారి భద్రతకు సామాజికంగా అంగీకరించబడిన ఏకైక మార్గం (నిరంతార్ ట్రస్ట్, 2015).

### బాల్య వివాహాలకు కారణాలు

దేశంలో –ముఖ్యంగా గ్రామీణ ప్రాంతంలో– బాల్య వివాహాలు ఉండడానికి అనేక కారణాలున్నాయి. పేదరికం, కుటుంబ గౌరవాన్ని నిలబెట్టి బాలికలకు రక్షణ కల్పించే విషయంలో ఉండే సామాజిక కట్టుబాట్లు బాల్య వివాహాలకు ప్రధాన కారణాలు.

**ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకం:**

**ఆంధ్రప్రదేశ్‌లో వేళ్ళూనుకుపోయిన సాంప్రదాయం రక్త సంబంధీకుల మధ్య పెళ్ళి. సాధారణంగా ఆంధ్రప్రదేశ్‌లో మేనమామను పెళ్ళి చేసుకోవడం జరుగుతోంది. నిజానికి, చాలా కుటుంబాల్లో ఆస్తి మరో కుటుంబానికి వెళ్ళకుండా కాపాడుకోవడానికి ఇలాంటి వివాహాలు చేస్తున్నారు. సాధారణంగా ఇలాంటి వివాహాల్లో బాలిక వయస్సు పురుషుడి కంటే చాలా తక్కువ. ఫలితంగా కుటుంబంలో బేరమాడే శక్తి తగ్గుతుంది. కుటుంబంలో వేధింపులు కూడా పెరుగుతాయి.**

**ఈ కారణాలు:**


- **సాంప్రదాయిక వ్యవస్థ.** బాల్య వివాహం సాంప్రదాయికంగా వస్తోంది. చాలా ప్రాంతాల్లో తరాలుగా కొనసాగుతోంది. సాంప్రదాయానికి భిన్నంగా ఉండడం వల్ల సమాజం నుండి వెలివేతకు గురయ్యే అవకాశం ఉంది.

  అమ్మాయి వయసు ఎక్కువైతే లేదా ఎక్కువగా చదువుకుంటే కట్నం కూడా అధికంగా ఇవ్వాలన్న భయం. పేద కుటుంబాల వారు బాల్య వివాహాలను తప్పనిసరిగా భావిస్తున్నారు. వివాహం వల్ల ఆడపిల్లలకు ఆర్థిక భద్రత వస్తుందని, ఆరోగ్య పరిరక్షణ కలుగుతుందని వారి భావన. పేదరికం వల్లే వరకట్న సమస్య కూడా అధికంగా ఉంది.



**వరకట్నాల శాతం,** బాలికల వయసు, విద్య  అనులోమ నిష్పత్తిలో ఉంటాయి. బాలికల వయస్సు, చదువు పెరిగిన కొద్దీ సమాన స్థాయిలో వయస్సు, చదువు ఉన్న వరుడు కావాలంటే వరకట్న రూపంలో అధిక మొత్తం ముట్టజెప్పాల్సి ఉంటుంది. ఈ సమస్యను గుర్తించి, 1958లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ వరకట్న నిషేధ చట్టాన్ని రూపొందించింది. కానీ ఈ చట్టం కింద విచారణ కఠినంగా ఉండకపోవడం వల్ల వరకట్నం సాంఘికంగా ఆమోదించబడినట్టుగా కొనసాగుతోంది.

- **ఆర్థిక ఇబ్బందులు, పేదరికం :** బాలికలను ఆర్థిక భారంగా పరిగణిస్తున్నారు. పెళ్ళి చేయడం వల్ల బాలికల చదువుకు, ఆహారానికి పెట్టే ఖర్చు తగ్గుతుందని వారి భావన.
- **నిరక్షరాస్యత :** అమాయకత్వానికి దారి తీసే నిరక్షరాస్యత బాల్య వివాహాలకు దారి తీస్తుంది. గ్రామాల్లో ఉన్నత విద్యకు అవకాశం లేకపోవడం వల్ల పై చదువుల కోసం గ్రామం వెలుపలికి పంపడం భద్రత పరమైన సమస్యలకు దారి తీస్తోంది. దాంతో ప్రాథమిక, ప్రాథమికోన్నత స్థాయి చదువులతో బడి మానేసిన బాలికలకు వివాహమే ఉత్తమ ప్రత్యామ్నాయమౌతుంది.
- **బాలికల రక్షణ, భద్రత :** శారీరక, లైంగిక వేధింపుల నుండి రక్షణ కోసం బాలికలకు వివాహం చేయడం తరచుగా జరుగుతుంది. టీవీ కార్యక్రమాలు, సినిమాల ప్రభావం టీనేజీ శారీరక సంబంధాలకు దారి తీసి,  యువతీయువకులు లేచిపోయే ధోరణులు ప్రబలుతున్నాయి. కాబట్టి యుక్తవయస్సులోకి రాగానే కుటుంబ గౌరవాన్ని కాపాడుకునేందుకు, భద్రత కారణాల రీత్యా బాలికలకు పెళ్ళిళ్లు చేయాలని సామాజిక ఒత్తిడి అధికమౌతుంది.
- **కన్యాత్వ విలువ :** కుటుంబ గౌరవాన్ని నిలబెట్టడంలో అవివాహిత బాలికలకు ఉన్న ప్రాధాన్యత రీత్యా వధువు కన్యగా ఉండగానే వివాహం చేయాలనే ఉద్దేశ్యంతో త్వరితంగా పెళ్ళి చేయాలనే భావన ఉంది.
- **లైంగికత పాత్ర :** పురుషాధిక్యతను అంగీకరించేందుకు వీలుగా బాలికల సాంఘికీకరణ జరుగుతోంది. వారి అభిప్రాయాలతో నిమిత్తం లేకుండా వివక్ష కొనసాగుతోంది. వారు సాంఘిక, సాంస్కృతిక ఆధిపత్య భావజాలాన్ని స్వీకరించి, సహకారం అందించి, కొనసాగేందుకు ఊతమిస్తున్నారు. లైంగిక అసమానత్వం జననానికి పూర్వమే మొదలవుతుంది. భారతీయ మహిళల జీవిత కాలం మొత్తం ఈ అసమానత్వం ప్రతికూల ఫలితాలిస్తోంది. వయస్సుతో నిమిత్తం లేకుండా భారతీయ మహిళల దుస్థితిపై దృష్టి పెట్టాల్సిన అవసరముంది.



## రాష్ట్రాలవారీగా బాల్య వివాహాల పరిస్థితి

('రెడ్యూసింగ్ చైల్డ్ మ్యారేజెస్ ఇన్ ఇండియా' యూనిసెఫ్ నివేదిక, 2015)

**పట్టిక - 1**

| రాష్ట్రం | బాల్యవివాహాల శాతం (%) |
|---|---|
| ఆంధ్ర ప్రదేశ్ | 51.8 |
| అస్సాం | 39.9 |
| బీహార్ | 68.1 |
| గుజరాత్ | 35.4 |
| హర్యానా | 27.8 |
| హిమాచల్ ప్రదేశ్ | 9.1 |
| కర్నాటక | 50.2 |
| కేరళ | 15.5 |
| మధ్యప్రదేశ్ | 53.8 |
| మహారాష్ట్ర | 40.4 |
| ఒడిషా | 37.7 |
| పంజాబ్ | 15.7 |
| రాజస్థాన్ | 57.5 |
| తమిళనాడు | 23.9 |
| ఉత్తరప్రదేశ్ | 54.8 |
| పశ్చిమబెంగాల్ | 54.7 |

మూలం : డి.ఎల్.హెచ్.ఎస్. 2007-2008



# బాల్య వివాహాల వల్ల దుష్ఫలితాలు

**ఇలాంటి వివాహాల వల్ల కమల, ఇతర బాలికలూ ఎలాంటి నష్టాలకు గురవుతున్నారు?**

## "కమల కథ"

తన శరీరంలో యుక్త వయస్సు తెచ్చిన మార్పులను పరిశీలించుకోవడం మొదలు పెట్టిన పన్నెండేళ్ల కమలకు ఆమె వయస్సుకు రెండు రెట్లుండే అతనితో పెళ్లి చేశారు. పదమూడేళ్లకే ఆమె తల్లి అయింది. బాల్య వివాహపు బాధితురాలు మాత్రమే కాదు; ముందస్తు ప్రణాళిక లేని గర్భధారణ వల్ల కూడా బాధితురాలు కూడా.

పోషకాహార లేమితో, నిస్సత్తువతో ప్రసవానంతరం మంచంపై పడుకుంది. అప్పుడే పుట్టిన ఆడ శిశువును చూస్తూ ఆమె ఇలా అంటోంది. "*ఈ పాపతో ఏం చేయాలో నాకు తెలియదు. ఆ పాపను ఎలా సంరక్షించాలో నాకు తెలియదు.*" కమల నిస్సహాయతకు ప్రసవం ఇంటి దగ్గరే జరగాలన్న ఆమె తల్లిదండ్రుల అభీష్టమే కారణం. బాల్య వివాహాలు ఇంటి దగ్గర ప్రసవాలూ ఒక ప్రధాన భూమికను పోషిస్తున్నాయనడానికి ఇది ఒక ఉదాహరణ.

- బాల్య వివాహాల వల్ల కలిగే దుష్ఫలితాల్లో అత్యంత ప్రమాదకరమైనది చిన్న వయస్సులోనే గర్భందాల్చడం. దీని ఫలితంగా ప్రసవ సమయంలోనే శిశువు మరణించడం, అనారోగ్యంతో జన్మించడం జరుగుతుంది.
- యుక్తవయస్సులో మొదటి కొన్ని సంవత్సరాల్లో గర్భధారణ వల్ల గర్భస్రావం జరిగే అవకాశాలు అధికమౌతాయి. ప్రసవానికి ఆటంకాలు ఏర్పడడం, పోస్ట్-పార్టమ్ హేమరేజ్ (ప్రసవానంతరం మొదటి కొన్ని గంటల్లో రక్తస్రావం), ప్రసవ సమయంలో రక్తపోటు వచ్చే అవకాశాలున్నాయి. జీవితాంతం బాధించే ఆబ్‌స్టెట్రిక్ ఫిస్టులా వంటి వ్యాధులు వచ్చే అవకాశాలు కూడా ఉంటాయి. *ఈ*(పురీష నాళానికి-యోనికి మధ్యగాని, పిత్తాశయానికి-యోనికి మధ్యగాని ఒక రంధ్రం (ఫిస్టులా) పెరగడం. సాధారణంగా సరైన వైద్య సంరక్షణ లభించనప్పుడు ప్రసవం విఫలమైనప్పుడు ఇలా జరుగుతుంది).



- కౌమారప్రాయంలోని తల్లులకు మృత శిశువులు జన్మించే అవకాశాలున్నాయి. నెలలు నిండకముందే జన్మించడం, తక్కువ బరువుతో జన్మించడం వంటి ప్రతికూల ఫలితాలుంటాయి. శిశువు పుట్టిన తర్వాత కొద్దికాలానికే మరణించే అవకాశాలు కూడా ఉంటాయి. ఇరవైల్లో ఉన్న తల్లులకు పుట్టిన శిశువుల కంటే ఇరవయ్యేళ్ల లోపు పిల్లలకు పుట్టిన శిశువుల్లో మరణాలు 50 శాతం అధికం. (యూనిసెఫ్ నివేదిక).

- **ఈ దుష్ఫలితాల్లో అధికశాతం ప్రధానంగా బాలిక శారీరకంగా ఎదగకపోవడం వల్ల జరుగుతున్నాయి. కౌమార బాలికల్లో పొత్తికడుపు, జనన ద్వారం పూర్తి స్థాయిలో ఎదగకపోవడం వల్ల ఇవి సంభవిస్తున్నాయి. బాల్య వివాహాలు జరిగే సమాజాల్లో అత్యవసర ప్రసవ సౌకర్యాలు లేకపోవడం వల్ల ప్రసవంలో ఇబ్బందులు ఏర్పడే అవకాశాలున్నాయి.**

## విద్యాసంబంధిత సమస్యలు:

- బాల్య వివాహానికి, దాని వల్ల కలిగే దుష్ఫలితాలకు కారణం అవిద్య.
- అవిద్య బాలికకు ఎంచుకునే అవకాశాల్ని జీవితాంతం తగ్గిస్తుంది. సాంఘికీకరణ (స్నేహం చేయడం)పై ప్రభావం చూపిస్తుంది. వారికి, వారి కుటుంబాలకు ఆర్థిక స్వావలంబన అవకాశాల్ని తగ్గిస్తుంది.
- 2014లో జరిగిన అధ్యయనాల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో 6 నుంచి 13 సం॥ల వయో బృందంలో పాఠశాలకు హాజరయ్యే బాలికల శాతం 41.75. (ఎస్.ఎస్.ఎ. సర్వే అధారితంగా)
- తక్కువ చదువు చదవడం వల్ల భర్తలు చనిపోవడం గాని, వదిలివేసినప్పుడు గాని, విడాకులు ఇచ్చినప్పుడు గాని పేదరికంలో మగ్గిపోవడం కొనసాగుతుంది.



## సామాజిక సమస్యలు:

- చిన్న వయస్సులో వివాహితులయ్యే బాలికలకు స్వేచ్ఛను డిమాండ్ చేసేంత శక్తి ఉండదు.
- అవిద్య లేదా తక్కువ చదువు, ఆర్థిక విషయాల్లో ఇతరులపై ఆధారపడడం, నిర్ణయాత్మక శక్తి కొరవడడం, అసమానత్వం, లైంగిక వేధింపులు నవ వధువు మానసిక ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాన్ని కలిగిస్తాయి.
- 15-49 సంవత్సరాల వయో బృందంలో 34 శాతం మహిళలు శారీరక లేదా లైంగిక హింసకు గురయ్యారని ఎన్.ఎఫ్.హెచ్.ఎస్.3 గణాంకాలు వెల్లడిస్తున్నాయి. సరిగా వంట చేయకపోయినా, చెప్పకుండా బయటికి వెళ్ళినా పురుషుడికి కొట్టే హక్కు ఉందని ప్రతి ముగ్గురిలో ఇద్దరు స్త్రీలు అంటే 15-19 ఏళ్ల వయోబృందంలో 70.9 శాతం మంది భావిస్తున్నారు.
- వృద్ధులను పెళ్ళి చేసుకునే బాలికలు త్వరలోనే వైధవ్యానికి గురయ్యే అవకాశాలుంటాయి. సామాజిక హోదాలో తగ్గుదల, ఆస్తిని పొందడంలో ఇబ్బందులు మొదలైన సమస్యలు ఏర్పడతాయి.

## బాల్యవివాహాల నిరోధం - కౌమార సమవయస్క బృందాల పాత్ర

యుక్తవయస్సులోని వారు బయటివారికంటే సమవయస్కుల నుండే ఎక్కువగా నేర్చుకోవడం, భావాలను స్వీకరించడం జరుగుతుంది కాబట్టి బాల్య వివాహాలను నిరోధించడంలో సమవయస్క బృంద అభ్యసనం ప్రధాన పాత్ర పోషిస్తుంది. ఇలాంటి సందర్భాల్లో బోధకుడికి, అభ్యాసకుడికి మధ్య దూరం ఉండదు. అందువల్ల కొత్త ఆలోచనల్ని స్వీకరించడానికి, అమలు చేయడానికి అభ్యంతరం ఉండదు. పాత తరపు ఆలోచనలను తృణీకరించేందుకూ అవకాశం ఉంది. కాబట్టి శిక్షణల్లో దీన్ని పరిచయం చేయడం వల్ల ఈ భావజాల స్వీకరణకు, విజయవంతం అయ్యేందుకు అవకాశాలు పెరుగుతాయి.

సమవయస్క బృంద అభ్యసనలో భాగస్వామ్య అభ్యసనం ఉంటుంది. చర్చల్లోను, కృత్యాల్లోను యువకులు ఉత్సాహవంతంగా పాల్గొంటారు. అందువల్ల ఈ అభ్యసన ఫలవంతమవుతుంది. కేవలం సమాచారం పొందడం ద్వారా కాకుండా చేయడం ద్వారా నేర్చుకుంటారు. అందువల్ల సమవయస్క విద్య భావ ప్రసారానికి చక్కటి మార్గం. ఇది యువకులను చర్యకు ఉద్యుక్తులను చేస్తుంది. కిందివిధమైన భాగస్వామ్య అభ్యసన మార్గాలను సమవయస్క బృంద వాలంటీర్లు చేపట్టవచ్చు.

బృంద చర్చలు

రోల్ ప్లే రంగస్థలం వీధి నాటకాలు

పోస్టర్ల తయారీ గోడలపై రాతలు

కమ్యూనిటీ మొబిలైజేషన్

రేడియో టీవి కార్యక్రమాలు

**అవకాశముంటే కింది సినిమాను సమవయస్క బృంద నాయకులు ప్రదర్శించవచ్చు.**

## కృత్యం (30 నిముషాలు)

**అవసరమయ్యే సామాగ్రి : సినిమా, మాడ్యూల్**

లక్ష్యం : బాల్య వివాహం వల్ల కలిగే దుష్ఫలితాలను కళ్లకు కట్టినట్టు చూపి, దృశ్య ప్రభావాన్ని ఏర్పరచడం ఈ షార్ట్ ఫిల్మ్ ఉద్దేశ్యం.

'లైక్ సిస్టర్స్' అనే ఈ షార్ట్‌ఫిల్మ్‌ను బృంద నాయకుడు /నాయకురాలు ప్రదర్శించవచ్చు లేదా కథను వివరించవచ్చు.

**మనం వినే దానికంటే చూసే దాన్నే ఎక్కువగా గుర్తుంచుకుంటాం.**

http://www.dailymotion.com/video/x32ota2

- అనంతరం కథనుండి ఏం నేర్చుకున్నారో చెప్పమని పార్టిసిపెంట్స్‌ను అడగాలి.
- బాల్యవివాహ నిషేధ చట్టాన్ని గురించి, బాల్య వివాహానికి బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యల గురించి బృంద నాయకుడు /నాయకురాలు వివరించాలి.
- అనంతరం బృంద నాయకుడు /నాయకురాలు పార్టిసిపెంట్స్ నుండి సమాచారం రాబట్టాలి. బాల్యవివాహాలకు వ్యతిరేకంగా పీర్ గ్రూప్ వాలంటీర్లుగా మద్దతు తెలపమనాలి. బాల్య వివాహాలను నిరోధించేందుకు వారి వంతు కృషి చేయమని చెప్పాలి.

**పీర్‌గ్రూపు సభ్యులు కింది స్లోగన్లు / పోస్టర్లు తయారుచేసి ప్రదర్శించాలి.**

1. బాల్య వివాహాలు కుదరవని చెప్పండి. బాల్య వివాహాలను నిరోధించే వ్యక్తులు, సమూహాలు, సామాజిక వర్గాల (ఎన్.ఎస్.ఎస్., ప్రభుత్వేతర స్వచ్ఛంద సంస్థలు, నోడల్ ఏజెన్సీల) సహాయం తీసుకోండి.
2. బాల్య వివాహాల గురించి మాట్లాడండి. బాల్య వివాహాల వల్ల అనర్థాల గురించి తెలుసుకోండి. వాటిని మీ సమవయస్కులతో, సమాజంతో పంచుకోండి. కౌమార వయస్కుల హక్కుల అవగాహన కల్పించండి.

3. బాల్యవివాహాల సమాచారాన్ని వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురండి. లేదా మీ చుట్టుపక్కల సమాజంలో నమ్మదగిన పెద్దవారి దృష్టికి గాని, వాలంటీర్ల దృష్టికి గాని, న్యాయ వ్యవస్థ దృష్టికి గాని, మహిళా సంఘాల దృష్టికి గాని, స్థానిక సంస్థల దృష్టికి గాని తీసుకురావాలి.




4. జననాల నమోదును సరి చూడండి. కౌమారప్రాయంలోని వారి జననం నమోదు అయిందేమో సరిచూడండి. జనన నమోదు లేకుండా న్యాయపరమైన వయస్సును ధృవీకరించడం గాని, రక్షణ కోరడం గాని సాధ్యపడదు.

5. అన్ని వివాహాలను నమోదు చేయాలి. దీనివల్ల న్యాయస్థానంలో న్యాయపరమైన రక్షణ కోరడానికి అవకాశం ఉంటుంది.

6. వయస్సుకు తగ్గ లైంగిక, పునరుత్పత్తి ఆరోగ్య సమాచారం పొందండి. వివాహంతో ముడిపడి ఉన్న లైంగిక అంశాల పట్ల అవగాహన కల్పించే సేవలకు అందుబాటులో ఉండండి.

7. అవాంఛిత గర్భం రాకుండా ఉండేందుకు, కుటుంబ నియంత్రణ కోసం వివిధ గర్భనిరోధక విధానాల అవగాహన కలిగిఉండండి. కౌమార బాలబాలికలు, సమాజం బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను ఊహించవచ్చు.

**బాల్యవివాహాల నిరోధానికి, బాలల రక్షణకు న్యాయపరమైన రక్షణ చట్టం ఉంది.**

**బాల్యవివాహాల నిషేధ చట్టం, 2016 ప్రకారం బాలికలకు 18 సం.లోపల, బాలలకు 21 సం.లోపల వివాహం చేయడం నేరం.**



**బాల్య వివాహానికి శిక్ష లక్ష రూపాయల వరకు జరిమానా లేదా రెండేళ్ల వరకు జైలు శిక్ష లేదా ఈ రెండూ. ఇది విచారణ కూడా అవసరం లేని నాన్ బెయిలబుల్ నేరం.**

# చట్టం గురించి తెలుసుకోండి :

## బాల్య వివాహ నిషేధ చట్టం-2006

**1. ఈ చట్టం కింద వరుడికి శిక్ష ఉంటుందా?**

వివాహ సమయంలో వరుడికి 18 సం. నిండితే నేరస్తుడిగా పరిగణించి, శిక్ష విధిస్తారు.

**2. వివాహం చేసుకోబోయే పిల్లల తల్లిదండ్రులకు శిక్ష ఉంటుందా?**

పిల్లల తల్లిదండ్రులు, బాల్య వివాహంతో సంబంధం ఉన్న ఏదైనా సంస్థ, దాని సభ్యులు, దాన్ని ఆపేందుకు పట్టింపు లేకుండా ఉన్న వారికి కూడా శిక్ష పడే అవకాశముంది.

**3. బాల్యవివాహం చేయడం, హాజరు కావడం కూడా నేరాలేనా?**

బాల్య వివాహం చేసేవారు, హాజరయ్యేవారు, ప్రేరేపించేవారు విచారణ ఎదుర్కోక తప్పదు. ఈ చట్టం కింద మహిళలకు జైలు శిక్ష విధించరు.

**4. పి.సి.ఎం.ఎ. చట్టం కింద శిక్ష పరిమితి ఏమిటి?**

పి.సి.ఎం.ఎ. చట్టం కింద చట్టాన్ని అతిక్రమించినవారికి రెండేళ్ల వరకు జైలు శిక్ష గాని, లక్ష రూపాయల వరకు జరిమానా గాని, రెండూ గాని విధిస్తారు.

**5. చిన్న వయస్సులోనే వివాహమైన బాలిక లేదా బాలుడు ఆ వివాహాన్ని చెల్లదని ప్రకటించవచ్చా?**

అతను / ఆమె ఆ వివాహాన్ని చెల్లదని ప్రకటించాలని న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చు. అయితే ఈ పిటిషన్‌ను బాలిక అయితే 20 సంవత్సరాలు వచ్చేలోగా, బాలుడైతే 23 సం. వచ్చేలోగా దాఖలు చేయవలసి ఉంటుంది.

**6. ఆ బాలిక / బాలుడు వ్యక్తిగతంగా పిటిషన్‌ను దాఖలు చేయవలసిఉంటుందా?**

వివాహం చెల్లదని ప్రకటించేందుకు వివాహ సమయంలో చిన్న వయస్సులో ఉన్న బాలిక / బాలుడు న్యాయస్థానంలో స్వయంగా పిటిషన్‌ను దాఖలు చేయాల్సి ఉంటుంది. ఒకవేళ అతను / ఆమె ఇంకా మైనర్‌గానే ఉంటే వారి పక్షాన సంరక్షకుడు గాని, స్నేహితులు గాని బాల్య వివాహ నిషేధ అధికారితో కలిసి పిటిషన్‌ను దాఖలు చేయవచ్చు.

**7. ఇంకా ఎలాంటి సందర్భాల్లో బాల్య వివాహాన్ని చెల్లదని ప్రకటించవచ్చు?**

అక్రమరవాణా, ప్రలోభానికి గురిచేయడం, బలప్రయోగం చేయడం, మోసం చేయడం వల్ల కూడా ఆ వివాహాలను చెల్లవని ప్రకటించవచ్చు.

**8. వివాహ రద్దు తర్వాత బాలిక జీవనభృతికి ఏమైనా అవకాశాలు ఉన్నాయా?**

వివాహ రద్దు నుండి పునర్వివాహం అయ్యేంత వరకు ఆ బాలిక ఉండేందుకు సురక్షితమైన ఇల్లు, భరణం చెల్లించాలని న్యాయస్థానం ఉత్తర్వు ఇవ్వవచ్చు.

**9. బాల్య వివాహం ఫలితంగా పుట్టిన పిల్లలకు న్యాయపరమైన హక్కులు ఉంటాయా?**

బాల్య వివాహం –అమలులో ఉన్నా, రద్దయినా –దాని ఫలితంగా పుట్టిన పిల్లలను న్యాయబద్ధ వారసులుగా భావించి అన్ని రకాల హక్కులు కల్పిస్తారు.

**10. రక్షణ కోసం, ఫిర్యాదు చేయడానికి ఎవరిని సంప్రదించాలి?**

అంగన్‌వాడీ కార్యకర్తలను, బాల్య వివాహ నిషేధ అధికారులను (సి.ఎం.పి.ఓ.), పోలీసులను, పంచాయతీ సభ్యులను, ప్రభుత్వేతర స్వచ్ఛంద సంస్థలను, బాల్య వివాహాల నిరోధానికి కృషి చేస్తున్న వాలంటీర్లను రక్షణ కోసం సంప్రదించవచ్చు.

**11. బాల్య వివాహ నిషేధ అధికారులు (సి.ఎం.పి.ఓ.) ఎవరు?**

ఈ చట్ట అమలుకు బాధ్యత వహించే అధికారులే బాల్య వివాహ నిషేధ అధికారులు (సి.ఎం.పి.ఓ.లు). రాష్ట్రప్రభుత్వం వీరిని నియమిస్తుంది. పోలీసు అధికారులకుండేటువంటి అధికారాలే వీరికీ ఉంటాయి. బాల్య వివాహాలను నిరోధించేందుకు జిల్లా మెజిస్ట్రేట్ లకూ అదనపు అధికారాలు ఇస్తారు.

- *సంబంధిత జిల్లా కలెక్టరు ఆ జిల్లా సి.ఎం.పి.ఓ.గా వ్యవహరిస్తారు.*
- *డివిజన్ స్థాయిలో రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్.డి.ఓ) / సబ్ కలెక్టర్ సి.ఎం.పి.ఓ.గా ఉంటారు.*
- *3–5 మండలాల పరిధిలో ఒక శిశు సంక్షేమ ప్రాజెక్టు అధికారి (సి.డి.పి.ఓ.) సి.ఎం.పి.ఓ.గా ఉంటారు.*
- *మండల స్థాయిలో తహశీల్దార్లు వారి పరిధిలోని గ్రామాల్లో సి.ఎం.పి.ఓ.గా వ్యవహరిస్తారు.*
- *మండల స్థాయిలో వారి పరిధిలోని గ్రామాల్లో ఐ.సి.డి.ఎస్. పర్యవేక్షకులు సి.ఎం.పి.ఓ.గా ఉంటారు.*
- *పంచాయతీ రాజ్ శాఖకు చెందిన పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ శాఖకు చెందిన గ్రామ రెవెన్యూ అధికారులు గ్రామస్థాయిలో సి.ఎం.పి.ఓ.గా వ్యవహరిస్తారు.*

**12. సి.ఎం.పి.ఓ.కు సహాయపడడానికి గ్రామ / మండల స్థాయిలో ఎవరైనా ఉంటారా?**

స్థానిక పంచాయతీ సభ్యులు లేదా ప్రభుత్వం చే గుర్తించబడి, సమాజానికి అందుబాటులో ఉండే ప్రభుత్వేతర స్వచ్ఛంద సంస్థ కార్యకర్తను రాష్ట్ర ప్రభుత్వం సి.ఎం.పి.ఓ.కు సహాయపడడానికి నియమిస్తుంది.

**13. నిషేధ అధికారి విధులేమిటి?**

- *బాల్య వివాహాలను అడ్డుకోవడం*
- *విచారణకు అవసరమయ్యే సాక్ష్యాలను సేకరించడం*
- *ఈ సమస్యపై, చట్టంపై అవగాహన కల్పించడం*
- *బాల్య వివాహాలకు వ్యతిరేకంగా కౌన్సిలింగ్ నిర్వహించడం, సలహాలివవ్వడం.*
- *సమాజాన్ని చైతన్యపరచడం*
- *గణాంకాలను నిర్వహించడం, పంపిణీ చేయడం*

**బాల్య వివాహాలను అడ్డుకోవాలంటే ఎవర్ని సంప్రదించాలి?**

- **సమీపంలోని అంగన్‌వాడీ కార్యకర్తకు ఫిర్యాదు చేయండి.**
- **బాలల హెల్ప్‌లైన్‌ను 1098 నెంబరులో సంప్రదించండి.**
- **బాలల హక్కుల రక్షణకై ఉద్దేశించిన రాష్ట్రస్థాయి కమీషన్‌ను సంప్రదించండి.**

# బాలకార్మిక వ్యవస్థ - నిర్మూలన



## కృత్యం-1 (45 నిముషాలు -ఒక్కో సమస్యకు 15 నిముషాలు)

### ఈ చర్చ అనంతరం గ్రూపు వర్క్ చేయించాలి.

- చర్చలో పాల్గొన్నవారిని బాల కార్మిక వ్యవస్థపై వారి అనుభవాలను చెప్పమనాలి. వాటిని క్లుప్తంగా కథ రూపంలో రాయమని గ్రూపు లీడర్ చెప్తారు.
- ఈ కథలను మొత్తం బృందంతో ఫెసిలిటేటర్ చర్చిస్తారు.
- ఆయా సందర్భాలలో నివారణోపాయాలను /పరిష్కారమార్గాలను కూడా సూచించమని ఫెసిలిటేటర్ వారిని అడుగుతారు.
- ఈ సంఘటనలపై చర్చించేటప్పుడు బాల కార్మిక వ్యవస్థకు సంబంధించిన ఆయా సమస్యలపై అదనపు సమాచారాన్ని ఫెసిలిటేటర్ అందజేయాలి.

### గ్రూపులో ఆలోచనలను రేకెత్తించడానికి కింది కేస్ స్టడీని గ్రూపు లీడర్ వివరించాలి.

### కేస్ స్టడీ (మూలం : ఎం.వి.ఫౌండేషన్)

#### కుమారి కథ

ఆర్థిక కారణాల వల్ల కుమారి నాలుగో తరగతిలో బడి మానేసింది. ఆమె తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలుగా పనిచేసేవారి. పొలం యజమాని ఆర్థిక ఇబ్బందుల వల్ల కుమారి తల్లిదండ్రులను పని నుండి తొలగించారు.

**ఉపాధి పొందడం:** కుమారికి తిరిగి బడిలో చదువుకోవాలని ఆసక్తి. ఆమె అత్త (ఆంటీ) ఊరికొచ్చింది. ఆమెను సిటీకి తీసుకెళ్ళి చదివిస్తానంది. దాంతో కుమారి ఎగిరి గంతేసింది. అత్తతో పాటు హైదరాబాదు వెళ్ళింది. కుమారిని పనిలో పెడతారని ఆమె తల్లిదండ్రులకు తెలియదు. ఐదుగురు సభ్యులుండే ఒక కుటుంబం దగ్గర ఆమె ఏడు నెలలు వెట్టిచాకిరీ చేసింది. ఆమె టాయిలెట్‌లో పడుకోవాల్సివచ్చేది. ఆమె పని చేసే కుటుంబంలో భర్త కొంచెం మంచివాడైనా అతని భార్య, అత్త పాడైపోయిన ఆహారం పెట్టేవారు.

ఉదయం 4.30 నుండి అర్ధరాత్రి వరకు, వారంలో ఏడు రోజులూ కుమారి పనిచేసేది. ఆమె బాధ్యతలు:

- అంట్లు తోమడం
- ఇంటికి కూరగాయలు తీసుకురావడం
- కూరగాయలని తరగడం
- బట్టలుతకడం
- ఇంట్లో పిల్లలకు పనిచేసి పెట్టడం

ఆమెకు నిలబడడం కష్టమయ్యేది. ఆమె పాదం బాగా బాధించేది. పిల్లల పనుల కోసం బయటికి వెళ్ళవలసి రావడం ఆమెకు అతి కష్టమైన పని.

**జీతభత్యాలు:** ఈ పనికి ఒక సంవత్సరం ఒప్పందం కుదిరింది. డబ్బులు సంవత్సరం చివర్లో ఇచ్చేందుకు ఒప్పుకున్నారు. ఏడు నెలల తర్వాత ఆమెను తీసుకెళ్ళడంతో ఆమె పనిచేసిన కాలానికి కూడా డబ్బులిచ్చేందుకు యజమాని నిరాకరించాడు.

**పనిలో విరామం:** ఆమె పనిచేసిన ఏడు నెలల కాలంలో ఒక్కరోజూ ఆమెకు సెలవు ఇవ్వలేదు. సెలవు కోసం ఆమె పలుసార్లు అడిగినా ఇవ్వలేదు. ఆమె తల్లిదండ్రులకు మాత్రమే ఒక్క ఫోన్‌కాల్ చేసేందుకు అనుమతించేవారు. వారాంతాల్లో ఒక గంట టీవీ చూడవచ్చు. ఇతరత్రా విరామం ఏదీ లేదు. ఆ కుటుంబం ఎక్కడికైనా వెళ్ళినా తిరిగివచ్చే వరకు చేసేందుకు చాంతాడంత పనుల జాబితా అప్పజెప్పేవారు.

**తప్పించుకునేందుకు ప్రయత్నం :** అది కొత్త ప్రదేశం కాబట్టి ఆమె ఎప్పుడూ తప్పించుకునేందుకు యత్నించలేదు. బయటికి వచ్చినా దారి తెలియకపోవడం, యజమాని అంటే భయం ఆమె తప్పించుకోకుండా ఉండేందుకు మరో రెండు కారణాలు.

**రక్షణ :** ఏడు నెలలు పనిచేసిన తర్వాత ఒకరోజు ఆమెను మందులు కొనేందుకు బయటికి పంపించారు. కార్మికశాఖ ఉద్యోగులు ఆమెను పరిశీలించి పట్టుకున్నారు. ఆమెను క్యాంపుకు తీసుకెళ్ళారు. ఎటూ వెళ్తుంది తెలియకపోవడంతో పాటు భయం వేసింది. దాంతో ఆమె ఏడ్చింది. తనను బాగా చూసుకుంటున్నారని, చదివిస్తున్నారని అందరితో చెప్పాలని యజమాని ఆమెకు చెప్పాడు. నిజం చెప్పితే ఒప్పందాన్ని ఉల్లంఘించినందుకు ఆమె తల్లిదండ్రులను జైలుకు పంపిస్తానని బెదిరించాడు.

ప్రభుత్వేతర స్వచ్ఛంద సంస్థ ఎం.వి.ఎఫ్.కు చెందిన క్యాంపుకు కార్మిక శాఖ అధికారులు ఆమెను తరలించారు. పలుమార్లు కౌన్సిలింగ్ నిర్వహించిన తర్వాత ఆమె తన పరిస్థితిని ఏకరువు పెట్టింది.

**పార్ట్‌టైంగా గాని, ఫుల్ టైంగా గాని ఆర్థిక కార్యకలాపాల్లో పిల్లలను భాగస్వాములను చేసే దాన్నే బాల కార్మిక వ్యవస్థగా పేర్కొంటారు. దీని వల్ల బాలలు బాల్యానికి దూరమవుతారు. వారి శారీరక, మానసిక వికాసానికి ఇది విఘాతం కలిగిస్తుంది. దేశంలో బాల కార్మిక వ్యవస్థ వేళ్ళూనుకోవడానికి పేదరికం, మంచి పాఠశాలలు లేకపోవడం, అనియత ఆర్థిక వ్యవస్థ వృద్ధి ప్రధాన కారణాలు.**

### బాల కార్మిక వ్యవస్థలో ఉండే పని:

- మానసికంగా, శారీరకంగా, సామాజికంగా, నైతికంగా పిల్లలకు ప్రమాదకరం.
- వారిని బడికి హాజరు కాకుండా నిరోధిస్తుంది. ముందుగానే బడి మానేసేందుకు దోహదం చేస్తుంది.
- అధిక పని ఒత్తిడితో పాఠశాలకు హాజరు అయ్యేలా చేస్తుంది.

## బాల కార్మిక వ్యవస్థ (నిర్మూలన, క్రమబద్దీకరణ) చట్టం, 1986 ప్రకారం బాల కార్మిక వ్యవస్థకు నిర్వచనం.

1. 'సరైన ప్రభుత్వం' అంటే కేంద్ర ప్రభుత్వం లేదా రైల్వే పరిపాలన లేదా నౌకాశ్రయం లేదా గని లేదా చమురు క్షేత్రానికి చెందిన సంస్థ. ఇతర అన్ని సందర్భాలలో రాష్ట్ర ప్రభుత్వం.
2. "బాలుడు / బాలిక" అంటే పద్నాలుగు సంవత్సరాల వయస్సు పూర్తి కాని కౌమారప్రాయంలోనివారు.
3. "రోజు" అంటే అర్ధరాత్రి నుండి మొదలుకొని 24 గంటల కాలం.
4. "సంస్థ" అంటే ఒక దుకాణం, వాణిజ్య సంస్థ, వర్క్‌షాప్, వ్యవసాయ క్షేత్రం, నైవాసిక హోటల్, రెస్టారెంట్, థియేటర్ లేదా ఇతర వినోద ప్రాంతం.
5. "కుటుంబం" అంటే ఒక వ్యక్తి, భార్య లేదా భర్తతో పాటు వారి పిల్లలు, ఆ వ్యక్తి యొక్క సోదరుడు లేదా సోదరి.
6. "ఆక్రమించినవారు" అంటే ఒక సంస్థ లేదా వర్క్‌షాప్ వ్యవహారాలపై నియంత్రణ ఉండే వ్యక్తి.
7. "నౌకాశ్రయ అధికారి" అంటే నౌకాశ్రయాన్ని పరిపాలించే అధికారి.
8. "నిర్దేశించిన" అంటే సెక్షన్ 18 ప్రకారం నియమాలననుసరించి నిర్దేశించబడిన అని అర్థం.
9. "వర్క్‌షాప్" అంటే పారిశ్రామిక కార్యకలాపాలు జరిగే ఏదైనా ఆవరణ. అయితే ఫ్యాక్టరీస్ చట్టం, 1948లోని సెక్షన్ 67 (1948లోని 63) పరిధిలోకి రాని ఆవరణ.

## ఆర్థిక కార్యకలాపాలు జరిగే రంగాలవారీగా బాల కార్మికుల పంపిణీ

- వ్యవసాయరంగంలో వ్యవసాయం, వేట, చేపలు పట్టడం వంటి కార్యకలాపాలు. (58.6 శాతం)
- పారిశ్రామిక రంగంలో గనుల్లో, క్వారీల్లో, తయారీల్లో, నిర్మాణ పనుల్లో, ప్రజావసరాల్లో(విద్యుత్, గ్యాస్, నీళ్లు).
- సేవారంగంలో హోల్‌సేల్, రిటైల్ వ్యాపారాలు; రెస్టారెంట్లు, హోటళ్లు; రవాణా, నిల్వ, సమాచారం; ఆర్థిక, ఇన్సూరెన్స్, రియల్ ఎస్టేట్, వ్యాపార సేవలు; సామాజిక, వ్యక్తిగత సేవలు (25.4 శాతం)

## విచారించదగ్గ విషయం

దేశంలో ప్రతి 10 మంది పనివారిలో ఒకరు బాలలే. జి.డి.పి.లో వీరివాటా గణనీయం.

| | 5-14 సం. | 15-19 సం. | పనిచేసేవారి మొత్తం శాతం |
|---|---|---|---|
| మొత్తం పనివారు | 126 | 324 | 11.18 |
| వ్యవసాయదారులు | 42.7 | 94 | 10.74 |
| వ్యవసాయ కూలీలు | 47.8 | 116 | 5.36 |
| వేట, పశుగణాభివృద్ధి, తదితరులు | 7.6 | 12 | 13.57 |
| గనులు, క్వారీలు | 0.44 | 1.6 | 8.31 |
| తయారీ (గృహ పరిశ్రమలు) | 8.1 | 17.9 | 5.37 |
| తయారీ (గృహేతర పరిశ్రమలు) | 54 | 26.6 | 10.80 |
| నిర్మాణరంగం | 2 | 12.5 | 19.98 |
| హోల్‌సేల్, రిటైల్ వ్యాపారాలు | 43 | 19 | 8.05 |
| హోటళ్లు, రెస్టారెంట్లు | 0.7 | 2.4 | 10.47 |
| రియల్ ఎస్టేట్ తదితరులు | 3.4 | 5.5 | 7.94 |

*అంకెలు మొత్తం లక్షల్లో (2011 జనాభా లెక్కల ప్రకారం)*

*ది జువినైల్ జస్టిస్ యాక్ట్ 2000*

*(Source: www.businesstoday.in June 7,2015)*

## బాల కార్మిక వ్యవస్థకు సంబంధించి ఆందోళన కలిగించే 10 గణాంకాలు

**(అంతర్జాతీయ కార్మిక సంస్థ విడుదల చేసిన వరల్డ్ రిపోర్ట్ ఆన్ చైల్డ్ లేబర్ 2015, 2011 జనాభా లెక్కలపై 'చైల్డ్ రైట్స్ అండ్ యు' సంస్థ విశ్లేషణ ప్రకారం)**

1) దేశంలోని ప్రతి పదకొండు మంది పిల్లల్లో ఒకరు పనిచేస్తున్నారు.

2) 2001 నుండి 2011 వరకు ప్రతి ఏటా బాల కార్మికుల శాతం 2.2 తగ్గుతూ వస్తోంది.

3) పనిచేసే పిల్లల్లో 80 శాతం మంది గ్రామీణ ప్రాంతాలకు చెందినవారే. ఈ పిల్లలు నలుగురిలో ముగ్గురు వ్యవసాయరంగంలో సాగుపనిలోనో, గృహ పరిశ్రమల్లో ఇంటికి సంబంధించిన పనుల్లోనో ఉన్నారు.

4) దేశంలోని 55 లక్షల బాల కార్మికుల్లో సగం కంటే అధిక శాతం మంది కేవలం ఐదు రాష్ట్రాల్లో అంటే బీహార్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, మహారాష్ట్రల్లోనే ఉన్నారు.

5) ప్రమాదకరమైన పనుల్లో ఉన్న పిల్లలు ఈ వయోబృందంలో ఉండి పని చేస్తున్న పిల్లల్లో 20.7 శాతం. ప్రమాదకర పరిస్థితుల్లో పనిచేస్తున్న వయోజనుల సంఖ్య 25 శాతం.

6) మొత్తం బాల కార్మికుల సంఖ్యలో 15 నుండి 17 సంవత్సరాల కౌమారప్రాయంలో ఉండి ప్రమాదకరమైన పనుల చేస్తున్న వారి సంఖ్య 62.8 శాతం.

7) ప్రమాదకరమైన పనుల్లో ఉన్న పిల్లల్లో పది శాతం పిల్లలు కుటుంబ సంబంధిత పరిశ్రమల్లో ఉన్నారు.

8) పనిచేస్తున్న కౌమారప్రాయుల్లో 56 శాతం మంది చదువుకోవడం లేదు. ప్రమాదకర పరిస్థితుల్లో పనిచేస్తున్న వారిలో 70 శాతం మంది చదువుకోవడం లేదు.

9) బాలికలకంటే బాలురే ప్రమాదకర పనుల్లో ఎక్కువగా నిమగ్నమవుతున్నారు. ఈ పనుల్లో ఉన్న బాలికల సంఖ్య 88 లక్షలు కాగా బాలుర సంఖ్య 3.87 కోట్లు.

10) కౌమారప్రాయులు ప్రమాదకర పనుల్లో ఉన్న సంఘటనలు నికరాగువాలో అధికం కాగా ప్రమాదకర పనుల్లో ఉన్న కౌమార ప్రాయంలోని వారి సంఖ్య భారతదేశంలోనే అధికం (24 లక్షలు).

దేశం మొత్తంలోని బాల కార్మికుల్లో సగానికిపైగా ఈ రాష్ట్రాల్లోనే ఉన్నారు. అత్యధికంగా బాల కార్మికులు ఉన్న రాష్ట్రం ఉత్తరప్రదేశ్. దేశం మొత్తం మీద ఉండే బాల కార్మికుల్లో కేవలం ఈ రాష్ట్రంలోనే 20 శాతం ఉన్నారు. క్యాంపెయిన్ అగైనెస్ట్ చైల్డ్ లేబర్ (సి.ఎ.సి) నివేదిక ప్రకారం భారత దేశంలో ఒక కోటి ఒక లక్ష ఇరవై వేల మంది బాల కార్మికులుంటే కేవలం ఉత్తరప్రదేశ్‌లోనే వీరి సంఖ్య 19,27,997. (మూలం : సేవ్‌దచిల్డ్రన్.ఇన్)

**భారతదేశంలో అధికంగా బాల కార్మికులు ఉన్న రాష్ట్రాలు ఐదు. అవి : బీహార్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర.**

*దేశంలోని గ్రామీణ ప్రాంతంలో అత్యధికంగా 80 శాతం బాలకార్మికులున్నారు. వీరిలో అధిక శాతం వ్యవసాయ రంగంలో ఉన్నారు. వీరిలో కొందరు గృహ పరిశ్రమల్లో, కుటుంబ వ్యాపారాల్లో ఉన్నారు.* మొత్తం బాల కార్మికుల సంఖ్యలో 15 నుండి 17 సంవత్సరాల కౌమారప్రాయంలో ఉండి ప్రమాదకరమైన పనుల చేస్తున్న వారి సంఖ్య 62.8 శాతం. *వీరిలో* పది శాతం పిల్లలు కుటుంబ సంబంధిత పరిశ్రమల్లో ఉన్నారు. పనిచేస్తున్న కౌమారప్రాయుల్లో సగానికి పైగా పిల్లలు చదువుకోవడం లేదు. ప్రమాదకర పరిస్థితుల్లో పనిచేస్తున్న వారిలో చదువుకోని పిల్లల సంఖ్య మరీ అధికం. బాలికల(88 లక్షలు) కంటే బాలురే (3.87 కోట్లు) ప్రమాదకర పనుల్లో ఎక్కువగా నిమగ్నమవుతున్నారు (అంతర్జాతీయ కార్మిక సంస్థ విడుదల చేసిన 'వరల్డ్ రిపోర్ట్ ఆన్ చైల్డ్ లేబర్ 2015 ప్రకారం).



2009-10లో జాతీయ స్థాయిలో నిర్వహించిన సర్వే ప్రకారం బాల కార్మికుల సంఖ్య 49.8 లక్షలకు తగ్గింది (5-14 సం. వయోబృందంలో రెండు శాతం కన్నా తక్కువ). 2011 జనాభా లెక్కల ప్రకారం5-14 వయోబృందంలోని పిల్లల సంఖ్య 25.96 కోట్లు కాగా వీరిలో బాల కార్మికుల సంఖ్య 43.5 లక్షలు. బాల కార్మిక సమస్య కేవలం భారతదేశం లోనే కాదు, ప్రపంచవ్యాప్తంగా ఉంది. ప్రపంచవ్యాప్తంగా 21.7 కోట్ల మంది పిల్లలు పనుల్లో ఉన్నారు. వీరిలో అధికులు ఫుల్ టైం పనుల్లోనే ఉన్నారు.

## బాల కార్మిక వ్యవస్థకు కారణాలు

**పేదరికం :** బాల కార్మిక వ్యవస్థకు పేదరికం ఒక కారణం. జీవించే ప్రాథమిక అవసరం కోసం బాల కార్మికులుగా మారడం చాలా వరకు కన్పిస్తుంది. పేదరిక ప్రభావం పిల్లల జీవితంపై పడుతుంది. వసతుల కొరత, నిరుద్యోగం, ప్రాథమిక సేవల కొరత, ఆదాయం – వీటి ప్రభావం అవిద్య; పోషకాహార లోపం; ఇంటా బయటా హింస; బాల కార్మిక వ్యవస్థ; కుటుంబం నుండి, చుట్టుపక్కల వాతావరణం నుండి సంక్రమించే వ్యాధులు మొదలైన వాటిపై ఉంటుంది.

**వలస :** అభివృద్ధి చెందిన దేశాల్లో వలసకు వెళ్ళేవారిలో మూడో వంతు 12 నుండి 24 ఏళ్ల మధ్య వయస్సువారే. తల్లిదండ్రులు వెంట లేని లేదా తల్లిదండ్రుల నుండి విడిపోయిన పిల్లలు వలస ప్రక్రియలో అన్ని దశల్లోనూ మానవహక్కుల ఉల్లంఘనకు, వేధింపులకు గురవుతున్నారు.


**నాణ్యత కలిగిన విద్య అందుబాటులో లేకపోవడం :** నాణ్యత కలిగిన విద్య లేకపోవడం పిల్లలు బడి నుండి డ్రాపౌట్ అయ్యేందుకు కారణమై, వారు శ్రామికుల్లా మారేదుకు అవకాశమిస్తోంది. పనిచేసే పిల్లల్లో చాలామంది బడికి వెళ్ళాలని కోరుకోవడం లేదు. దీనికి కారణం పాఠశాలలో విద్యార్జన కాలంలో తల్లిదండ్రులపై ఆర్థికంగా ఆధారపడాల్సిరావడం వారికి ఇష్టం లేకపోవడమే. జీవితంలో త్వరగా పనిచేయడం ప్రారంభించడం ఆర్థిక స్వాతంత్ర్యాన్ని కలిగిస్తుందని వారి అభిప్రాయం. పని అనుభవం కలిగి, భవిష్యత్తులో అధిక వేతనాలు పొందేందుకు ఇది దోహదం చేస్తుందని వారి ఆశాభావం.

### బాల కార్మిక వ్యవస్థ దుష్ఫలితాలు


**14 సం.లోపు ఉండే బాల కార్మికులు పలు సవాళ్లు ఎదుర్కొంటారు.**

- ఇరుకైన, జనసమ్మర్థం ఉన్న ప్రదేశాల్లో దీర్ఘకాలం పనిచేయాల్సి ఉంటుంది.
- అపాయకరమైన రసాయనాలు, కాలుష్యకారకాల వల్ల దృష్టిలోపాలు, వైకల్యాలు, పోషకాహార లోపం సంభవించే అవకాశం ఉంటుంది. క్షయ, శ్వాసకోశ వ్యాధులతో పాటు కాన్సర్ వంటి వ్యాధులకూ గురి కావచ్చు.

## బాల కార్మిక వ్యవస్థ - కారణాలు




## బాలకార్మిక వ్యవస్థ - నిర్మూలన



## చట్టం ఏం చెబుతోంది?

బాల కార్మిక నిషేధ, క్రమబద్ధీకరణ చట్టం, 1968.

**బాలలు :** 14 సం. వయస్సు పూర్తి కాని వ్యక్తులను బాలలుగా పేర్కొంటారు.

భారత రాజ్యాంగ ప్రాథమిక హక్కులు, ఆదేశ సూత్రాల ప్రకారం 14 సం.లోపు పిల్లలను ఫ్యాక్టరీలో, గనుల్లో, ఇతర అపాయకరమైన పనుల్లో చేర్చుకోవడాన్ని నిషేధించారు (ఆర్టికల్ 24). 6 నుండి 14 సం.లోపు పిల్లలు ఉచిత, నిర్బంధ విద్య పొందేందుకు అవసరమైన సదుపాయాలు, వనరులను 1960లోగా కల్పించాలని భారత రాజ్యాంగం ఆర్టికల్ 21 ఎ, ఆర్టికల్ 45 ప్రకారం పేర్కొంది. తర్వాత ఈ చట్టానికి అవసరమైన సవరణలు చేశారు.

**జరిమానాలు:** బాల కార్మిక నిషేధ, క్రమబద్ధీకరణ చట్టం, 1986 ను ఉల్లంఘించిన వారికి మూడు నెలల నుండి ఒక సంవత్సరం వరకు జైలు శిక్షగాని, పదివేల రూపాయల నుండి ఇరవై వేల రూపాయల వరకు జరిమానా గాని లేదా రెండూ గాని విధించే అవకాశం ఉంది. సెక్షన్ 3 కింద ఈ నేరం కొనసాగితే ఆరు నెలలనుండి రెండేళ్ల వరకు జైలు శిక్ష విధించేందుకు ఆస్కారం ఉంది.

## బాల కార్మికులు లేని సమాజం కోసం

బాల కార్మిక వ్యవస్థ జాతికి పెను సవాలు. ఈ సమస్య నివారణకు ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోంది. ఈ సమస్య పరిమాణాన్ని, విస్తృతిని దృష్టిలో పెట్టుకుంటే ఇది పేదరికం, నిరక్షరాస్యతలతో ముడిపడి ఉన్న సాంఘిక – ఆర్థిక సమస్య. సమస్య నివారణకు సమాజంలోని ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఉంది.

బాల కార్మిక వ్యవస్థ నుండి ఒక పిల్లవాడు బయటికి వచ్చాడంటే ఒక వయోజనుడికి ఉపాధి దొరికినట్టే. భారతదేశంలో నిరుద్యోగ వయోజనుల సంఖ్య అధికం. కాబట్టి పిల్లలు వెళ్ళడం ద్వారా కలిగే పని లోటును వీరు పూర్తి చేస్తారు. తద్వారా పిల్లలకు వారి బాల్యాన్ని సంతోషంగా గడిపే హక్కును కల్పించేవాళ్ళవుతారు.

రాజ్యాంగ నిబంధనలు, సవరణలు ఎన్ని ఉన్నా బాల కార్మిక సమస్య ప్రధాన సవాలుగానే కొనసాగుతోంది. బాల కార్మిక వ్యవస్థను రూపు మాపేందుకు తల్లిదండ్రులు, యజమానులు, పౌరసమాజంతో పాటు ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థల పాత్ర ప్రధానమైంది. ఈ వ్యవస్థను రూపుమాపేందుకు ప్రతి ఒక్కరూ కంకణ బద్ధులైతే ఈ సామాజిక సమస్యను అదుపులోకి తేవచ్చు.

పిల్లలు బాల కార్మిక వ్యవస్థ నుండి బయటికి వచ్చాక పునరావాసానికి, రక్షణకు కింది శాఖలు కృషి చేస్తాయి.

**కార్మిక శాఖ :** దాడులు నిర్వహిస్తుంది. బాలలను పనిలో పెట్టుకున్న యజమానికి వ్యతిరేకంగా చర్యలు తీసుకుంటుంది. పిల్లల వసతి, రవాణా, బాలల సంక్షేమ కమిటీ (సి.డబ్ల్యు.సి.) ముందు పిల్లలను హాజరుపర్చడం,





ఆహారం, దుస్తులు, వైద్య సహాయం మొదలైన విషయాల్లో ఎన్జీవోలతో సమన్వయపరుస్తుంది. జాతీయ బాల కార్మిక ప్రాజెక్టు, సర్వశిక్షా అభియాన్ పరిధిలో ఉన్న ప్రత్యామ్నాయ పాఠశాలల్లో వీరిని చేర్పిస్తారు.

**పోలీసు శాఖ :** దాడులకు అవసరమైన భద్రత బలగాలను ఏర్పరుస్తుంది. దాడుల్లో, అనంతరం సాక్ష్యాలను నమోదు చేస్తుంది. రక్షించిన బాల కార్మికులను టాస్క్‌ఫోర్స్ వారి సంరక్షణలో ఉంచుతారు. చట్ట ప్రకారం యజమానులను అరెస్టు చేసి, కేసు నమోదు చేస్తారు.

**జిల్లా పాలనాయంత్రాంగం :** బాలల సంక్షేమ కమిటీ (సి.డబ్ల్యు.సి.) ముందు పిల్లలను హాజరుపర్చి, వారి ఇళ్లకు పంపేముందు తాత్కాలిక షెల్టర్లలో వసతి కల్పిస్తారు. వారి ఇంటి చిరునామా ధృవీకరణ తదితరాల తర్వాత వారికి పునరావాసం కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తారు.

**సాంఘిక సంక్షేమ శాఖ :** బాలకార్మికుల హెల్ప్‌లైన్ 1098 ను అవసరమైన చోటికి విస్తరిస్తారు. ఆయా పిల్లలకు సరైన పునరావాస కల్పనకు వీలుగా బాల కార్మికుల ప్రత్యేక అవసరాలు, పునరావాసంపై సి.డబ్ల్యు.సి.ని కోరతారు.

**విద్యాశాఖ :** పాఠశాలల్లో చేరిన బాలకార్మికులకు పుస్తకాలు, యూనిఫాం అందజేస్తుంది. సర్వశిక్షాఅభియాన్ సహకారంతో ప్రత్యేక పాఠశాలల్లో అవసరమైన పిల్లలను చేర్పిస్తుంది. బడిబయటి పిల్లలను గుర్తిస్తుంది.

**మున్సిపల్ అధికారులు :** పిల్లల రక్షణ, పునరావాసం విషయాల్లో స్థానిక అధికారులకు, కార్మిక శాఖకు సహకరిస్తారు.

**ఆరోగ్య శాఖ :** అవసరమైతే దాడుల్లో వైద్యులు కూడా పాల్గంటారు. రక్షించిన పిల్లలకు వైద్యపరీక్షలు నిర్వహించేందుకు ఆసుపత్రులకు ఆదేశాలు జారీ చేస్తారు. ఈ పిల్లలకు రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం ద్వారా ఆరోగ్య సేవలు అందిస్తారు.

## ఆంధ్రప్రదేశ్‌లో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం నిర్వహిస్తున్న కార్యక్రమాలు

**సార్వత్రిక ఎలిమెంటరీ విద్య అమలుకు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమగ్ర విధానాన్ని ప్రవేశపెట్టింది. బడిబయట ఉన్న పిల్లలు బాల కార్మికులుగా మారేందుకు అవకాశం ఉందని భావిస్తారు. పాఠశాల విద్యాశాఖ, సర్వశిక్షాఅభియాన్, కార్మికశాఖ, జాతీయ బాల కార్మిక పథకం ఈ రెండు అంశాల్లో సమన్వయంతో పనిచేస్తాయి. గ్రామీణాభివృద్ధి శాఖ, పట్టణాభివృద్ధి శాఖ, స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ, సాంఘిక సంక్షేమ శాఖ ఈ కృషిలో సహకరిస్తాయి.**

## సహాయం కోసం సంప్రదించే విధానం

సమీపంలోని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి

చైల్డ్ హెల్ప్‌లైన్‌ను 1098 నెంబరులో సంప్రదించాలి.

# విద్య -ప్రాధాన్యత
# ప్రత్యామ్నాయ విద్య



# విద్య అంటే ఏమిటి?

అభ్యసనను, జ్ఞానార్జనను, నైపుణ్యాలను, విలువలను, నమ్మకాలను, అలవాట్లను పెంపొందించే ప్రక్రియను విద్య అంటారు. కథాకథనం, చర్చ బోధన, శిక్షణ, నిర్దేశాలతో కూడిన పరిశోధన వంటి అనేక మార్గాల్లో విద్యాబోధన జరుగుతుంది. తరచుగా విద్యాబోధన ఉపాధ్యాయుల మార్గదర్శనంలో జరుగుతుంది. అయితే కొన్ని సందర్భాల్లో అభ్యాసకులు తమలో తమకు విద్య అందించుకోవచ్చు. నియత, అనియతవిధానాల్లో విద్య నిర్వహించబడుతుంది. ఆలోచనలు, అనుభూతులు, చర్యలతో కూడిన ప్రభావయుత అనుభవాన్నే విద్యగా చెప్పుకోవచ్చు.

బోధనాపద్ధతిని 'పెడగాజీ' అంటారు.

విద్యను అనేక దశలుగా విభజించారు. పూర్వ ప్రాథమిక లేదా కిండర్‌గార్టెన్, ప్రాథమిక పాఠశాల, సెకండరీ పాఠశాల, కళాశాల, విశ్వవిద్యాలయం, అప్రెంటిస్‌షిప్ ద్వారా శిక్షణ.

## విద్య అవసరం

ఆహారం, నివాసం లాంటిదే విద్య కూడా. జీవనానికి మూలాధారంగా దీన్ని భావిస్తారు. ఆరోగ్యానికి ఆహారం, శరీరానికి నివాసం లాగే మెదడుకు విద్య.

- విద్య అనేక విషయాల్లో సహాయకారి. ప్రధానంగా విద్య ఆలోచించేందుకు, ప్రశ్నించేందుకు, స్పష్టంగా కనిపించేవాటికి వెనుక ఉండే కనబడని వాస్తవాలను చూసేందుకు ఇది ఉపకరిస్తుంది.
- మనుషులు సహజంగా ప్రశ్నించే స్వభావంతోనే పుడతారు. అభ్యసనానికి, కొత్త విషయాల అన్వేషణకు మనకుండే సహజ అభిలాషను కొనసాగిస్తూనే మన ఆసక్తులను సంతృప్తి పర్చుకునేందుకు విద్య చక్కటి మార్గం.
- విద్య మన పరిధిని విస్తృతం చేస్తుంది. మన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని గురించి అవగాహన పెంపొందిస్తుంది.
- సాంఘిక, ఆర్థిక అసమానతలను విద్య తగ్గిస్తుంది. ప్రగతిని సమానంగా పంచుకునేందుకు ఆస్కారం ఇస్తుంది.
- సంతోషకరమైన, స్థిరమైన జీవనానికి విద్య అవసరం. భద్రత కలిగిన జీవితం విద్యతో సాధ్యం.

- విద్యావంతులు అధిక మొత్తంలో వేతనం పొందే ఉద్యోగం పొందేందుకు అవకాశాలు హెచ్చుగా ఉంటాయి.
- విభిన్న సాంఘిక వర్గాల మధ్య ఉండే భేదాలు, లైంగిక భేదాల వల్ల అసమానతలను తొలగించేందుకు విద్య ఒక సాధనం. అవకాశాలను విస్తృతం చేస్తుంది. మహిళా సాధికారికతను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుంది.
- స్వయం స్వావలంబన పొందేందుకు అత్యంత ముఖ్యమైనది విద్య. ఆర్థిక స్వతంత్రతకు ఉపయోగపడుతుంది. స్వీయ నిర్ణయాలు తీసుకునేందుకు దోహదం చేస్తుంది.
- ప్రపంచాన్ని సురక్షిత, శాంతిమయ ప్రదేశంగా మారుస్తుంది. తప్పొప్పుల తేడాను గుర్తించేలా చేస్తుంది. చట్ట వ్యతిరేక పనుల అవగాహన కలిగి ఉంటాడు. దీనివల్ల చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే అవకాశాలు తక్కువ. పేదరికంలో మగ్గిపోయే నిరక్షరాస్యులు అవకాశాలు లేకపోవడం వల్ల దొంగతనం, దోపిడీలు వంటి చట్ట వ్యతిరేక పనులకు పాల్పడే అవకాశం ఉంది. చదువుకోవడం వల్ల హక్కులు, చట్టం, బాధ్యతల పట్ల అవగాహన కలిగి ఉంటారు. కాబట్టి సామాజిక సామరస్యం, శాంతి పరిఢవిల్లేందుకు విద్య దోహదం చేస్తుంది.
- పరిజ్ఞానానికి సూచిక విద్యాపరమైన డిగ్రీ. కాబట్టి అభిప్రాయాలు, దృక్కోణాలు వెల్లడించేందుకు విద్య ఆత్మవిశ్వాసాన్ని కలిగిస్తుంది.
- సమాజానికి ఉన్న కొన్ని నియమ నిబంధనల్లో విద్య కూడా ఒకటి. పిల్లలు పాఠశాలకు వెళ్ళి, అనంతరం ఉద్యోగం పొంది, జీవితంలో స్థిరపడాలని సమాజం ఆశిస్తుంది. సమాజానికి ఉపయోగకరమైన వ్యక్తిగా రూపొందేందుకు విద్య ఉపకరిస్తుంది. సమాజానికి తనవంతు సహాయం చేసేందుకు విద్య దోహదపడుతుంది. విద్య మనను చురుకుగా తయారు చేస్తుంది. అభివృద్ధిలో భాగస్వాములయ్యేలా చేస్తుంది.
- దేశ ఆర్థికాభివృద్ధికి విద్య ఊతమిస్తుంది. ఆస్ట్రేలియా,అమెరికా, జపాన్‌దేశాల అక్షరాస్యత శాతం అధికం. ఈ దేశాలు అత్యంత ధనిక దేశాలు. ఈ దేశాల్లో తలసరి ఆదాయం కూడా ఎక్కువే. మరోవైపు అభివృద్ధి చెందుతున్న దేశాలతో పాటు అక్షరాస్యత శాతం తక్కువగా ఉన్న ఇతర దేశాలు దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నాయి. **దేశ ఆర్థిక అభివృద్ధికి విద్య అత్యంత ప్రధానమైంది.**
- మనం మోసపోకుండా విద్య కాపాడుతుంది. అన్ని రకాల పీడనల నుండి, మోసాల నుండి విద్య రక్షిస్తుంది. హక్కులు, స్వేచ్ఛ మిళితమై ఉన్న భారతదేశంలో అమాయకులను, నిరక్షరాస్యులను మోసం

చేయడం సులువు. తప్పుడు డాక్యుమెంట్లలో సంతకం పెట్టడం మొదలైన వంటి వాటివల్ల నిరక్షరాస్యులు మోసపోయే అవకాశం ఉంది. విద్యావంతులకు అవగాహన ఉండడం వల్ల మోసపోయే అవకాశాలు తక్కువ.


**"మన పిల్లల మెదళ్లే మనకు గొప్ప వనరులు" - వాల్టర్ ఎలియాస్ డిస్నీ.**

ఆధునిక సమాజంలో భవిష్యత్తుకు బాటలు వేయడంలో విద్య పాత్ర కీలకమైంది. మానవ వనరులకు విద్య ఒక పెట్టుబడి. దేశాభివృద్ధి లక్ష్యాల సాధనలో ప్రధానపాత్ర పోషిస్తుంది.

భారతదేశంలో విద్య ప్రభుత్వ రంగంతో పాటు ప్రైవేటు రంగంలోనూ ఉంది. విద్యపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు; స్థానిక సంస్థలు వెచ్చిస్తున్నాయి. దేశంలోని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు 10 +2 విద్యావిధానాన్ని అనుసరిస్తున్నాయి.

దేశంలోని విద్యాస్థాయిలను కింది పట్టిక వివరిస్తుంది.

## భారత దేశంలో విద్యాస్థాయి:




దేశంలో ప్రధానంగా మూడు విద్యావిధానాలున్నాయి. అవి సి.బి.ఎస్.ఇ., ఐ.సి.ఎస్.ఇ., ఎస్.ఎస్.సి. వీటిలో మొదటి రెండు జాతీయ స్థాయిలో ఉన్నాయి. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సి.బి.ఎస్.ఇ.), ఇండియన్ సర్టిఫికెట్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (ఐ.సి.ఎస్.ఇ.) జాతీయ స్థాయిలోవి. మూడవదైన సెకండరీ స్కూల్ సర్టిఫికెట్ (ఎస్.ఎస్.సి.) విధానాన్ని రాష్ట్రాల విద్యాశాఖలు నిర్వహిస్తున్నాయి. ఈ విధానంలో పాఠ్యప్రణాళిక, బోధనా విధానం, మూల్యాంకన పద్ధతులను ఆయా రాష్ట్రాల విద్యా పరిశోధన, శిక్షణ సంస్థలు (ఎస్.సి.ఇ.ఆర్.టి.) నిర్ణయిస్తాయి. వీటికి జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ సంస్థ (ఎన్.సి.ఇ.ఆర్.టి.) మార్గదర్శనం చేస్తుంది. 7,40,000 పాఠశాలలతో ప్రపంచంలోనే అతి పెద్దదైన విద్యావ్యవస్థను భారతదేశం నిర్వహిస్తుంది.

గత కొన్ని దశాబ్దాలుగా అక్షరాస్యతా శాతాలు పెరుగుతూ వస్తున్నాయి. 2011 జనాభాలెక్కల ప్రకారం మన అక్షరాస్యతా శాతం 74.04. విద్యను అందరికీ అందుబాటులోకి తేవడం మన దేశం గణనీయ ప్రగతి సాధించింది.

ప్రాథమిక విద్యలో నమోదు చేయడంలో అంతర్జాతీయ స్థాయిని పొందాం. సెకండరీ పాఠశాల నమోదు 1990లో ప్రతి ఏటా 4.3 శాతం ఉండగా 2009-10 నాటికి ప్రతి ఏటా 6.27 శాతం నమోదు సాధించగలిగాం.

ప్రగతి ఆశాజనకంగా ఉన్నప్పటికీ విద్యను పూర్తి చేయడంలో పిల్లలకు అనేక సమస్యలున్నాయి. 6-14 వయోబృందంలో ఉన్న 25.2 కోట్ల మంది పిల్లల్లో 95 శాతం మంది (1 నుండి 8 తరగతుల్లో 19.2 కోట్ల మంది) పాఠశాలల్లో నమోదయ్యారు. విద్యపై ఉన్న డిమాండ్‌కు ఇది నిదర్శనం. అయితే వీరిలో 25.09 శాతం పిల్లలు ఐదో తరగతి పూర్తి చేసేలోగా, 42.68 శాతం పిల్లలు ఎనిమిదో తరగతి పూర్తి చేసేలోగా, 56.71 శాతం పిల్లలు పదో తరగతి పూర్తి చేసేలోగా బడి మానేస్తున్నారని గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

మొత్తం మీద దేశంలో ఎనిమిదో తరగతి (ఎలిమెంటరీ విద్య) పూర్తి చేసేలోగా 11.1 కోట్ల మంది పిల్లలు బడి మానేస్తున్నారు. దీని ఫలితంగా 15 నుండి 17 ఏళ్ల వయోబృందంలో 41 శాతం పిల్లలు పాఠశాలకు హాజరు అవుతున్నారు. సగానికి పైగా కౌమారప్రాయంలోని వారు డ్రాపౌట్‌గా మిగిలిపోతున్నారు.

బడి మానేయడానికి కారణాలు

విద్యను పూర్తి చేయడంలో అనేక సవాళ్లను పిల్లలు ఎదుర్కొంటున్నారు. కింది వర్గీకరణ ప్రకారం బడి మానేయడానికి రెండు ప్రధాన కారణాలున్నాయి.

**1. కుటుంబ / సమాజపరమైన అవరోధాలు**

**2. పాఠశాల స్థాయిలో అవరోధాలు**

**1. కుటుంబ / సమాజపరమైన అవరోధాలు :**

విద్యలో నమోదుకు, విద్య పూర్తి చేయడానికి కుటుంబం, సమాజం తీసుకునే నిర్ణయాలు ప్రధానమైనవి. ఈ అవరోధాల్లో మూడు సమస్యలు ముఖ్యమైనవి.

| కుటుంబపరమైన / సమాజపరమైన అడ్డంకులు | పాఠశాల స్థాయి అడ్డంకులు |
|---|---|
| ఆర్థిక కారణాలు | దూరం, రవాణా సౌకర్యం లేకపోవడం |
| + | + |
| ఇంటి పనులు | విద్యలో నాణ్యత లోపించడం |
| + | + |
| ఆసక్తి లేకపోవడం | సౌకర్యాలు లేకపోవడం |

- **ఆర్థికపరమైన కారణాలు :** కుటుంబ వ్యవసాయంలోనో, వ్యాపారంలోనో పనిచేసేందుకు తల్లిదండ్రుల పేదరికం కారణమౌతుంది. రోజువారీ కార్మికుడిగా కుటుంబ ఆదాయానికి పాలలో నీళ్లలా సహాయ పడడం చదువు నుండి దూరం కావడానికి దారి తీస్తుంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువు ఉచితమే అయినప్పటికీ నోటు పుస్తకాలు, రవాణా వంటి ఖర్చులు ఉంటున్నాయి.
- **ఇంటి పనులు :** కుటుంబ పరిమాణం పెద్దగా ఉండడం వల్ల చిన్న పిల్లల సంరక్షణ, ఇంటి పనులు ఆడపిల్లలకు అప్పజెప్పడం జరుగుతుంది. దీంతో చదువులో వెనుకబడడం, చదువు మానేయడం జరుగుతుంది.
- **ఆసక్తి లేకపోవడం :** భద్రతపై తల్లిదండ్రుల అభిప్రాయాలు, విద్య పట్ల ఉండే వ్యతిరేక ధోరణులు, పిల్లల్లో విద్యపట్ల ఆసక్తి లేకపోవడం చదువు మానేయడానికి మరి కొన్ని కారణాలు.

## ఆ. పాఠశాల స్థాయిలో అవరోధాలు

- **పాఠశాల అందుబాటు :** పాఠశాల మానేయడానికి ఇంటి నుండి పాఠశాలకు దూరం, రవాణా సౌకర్యాలు లేకపోవడం ముఖ్యమైన కారణాలు. నడిచేంత దూరంలో పాఠశాల లేకపోవడం, సురక్షితమైన ప్రజా రవాణా వ్యవస్థ లేకపోవడం పిల్లలు – ముఖ్యంగా బాలికలు బడి మానేయడానికి కారణాలు.



- **నాణ్యత కలిగిన విద్య లేకపోవడం :** బోధనాభ్యసనల్లో నాణ్యత లోపం దేశానికి పెను సవాలుగా మారింది. కాలం చెల్లిన పాఠ్యప్రణాళిక, బోధనావిధానాలు; సుశిక్షితులు కాని బోధనా సిబ్బంది వల్ల ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో దుష్ప్రభావం కలిగిస్తోంది.
- **వసతుల లేమి :** తాగునీరు, పాఠశాల భవనాలు, మూత్రశాలలు, మరుగుదొడ్లు మొదలైన కనీసవసతులు పాఠశాలలో పిల్లలు కొనసాగడానికి దోహదపడతాయి.
  - మూత్రశాలలు, మరుగుదొడ్లు లేకపోవడం వల్ల విద్యార్థులు – ముఖ్యంగా బాలికలు – పాఠశాలలో కొనసాగడం కష్టం.
  - టాయిలెట్స్, చేతులు కడుక్కోవడం వంటి శానిటేషన్ సౌకర్యాలు బాలల ఆరోగ్యంపై నేరుగా ప్రభావం చూపిస్తాయి. శానిటేషన్ సౌకర్యాల లేమి అతిసార వంటి వ్యాధులకు దారి తీస్తుంది. ఈ వ్యాధులు దీర్ఘకాలం ఉండడం పిల్లల తల్లిదండ్రులు పిల్లలను బడి మాన్పించేందుకు దారి తీస్తుంది.
  - పరిశుభ్రత లోపించడం, పోషకాహార లోపం, తీవ్రమైన రక్తహీనత మొదలైనవి కూడా బడి మానేయడానికి దారి తీస్తాయి.

## బడి మానేయడాన్ని నిరోధించే విధానాలు

### 1. బడి, సమాజ దృక్కోణం :

పాఠశాల సమాజంలో పిల్లలు ఒక భాగం. పాఠశాల బయటి సమాజంలోనూ వారు భాగస్వాములే. అత్యంత ప్రభావశీలత కలిగిన పాఠశాలలు సమాజంలో ఒక భాగంగా ఎదిగి, సమాజ సహకారం కలిగి ఉంటాయి. పాఠశాలకు పిల్లల గైర్హాజరు కేవలం పాఠశాల సమస్య మాత్రమే కాదు, అది ఒక సామాజిక సమస్య. కాబట్టి డ్రాపౌట్లను నిరోధించేందుకు, హాజరు శాతం పెంచేందుకు మూడు ముఖ్యమైన వ్యూహాలను అనుసరించవచ్చు.

- **కాలానుగుణంగా మార్పు చెందడం :** పాఠశాల విధానాలు, ఆచరణలు, సంస్థాగత నిర్మాణాలకు అనుగుణంగా లక్ష్యాలను మూల్యాంకనం చేయడం నిరంతరం జరగాలి. ఇవి అభ్యాసకులపై ప్రభావం చూపిస్తాయి.
- **పాఠశాలా సమాజం సమన్వయం :** సమాజంలోని అన్ని వర్గాల వారు పాఠశాలకు ఉమ్మడిగా సహకారం అందజేస్తే పాఠశాలలో అన్ని వనరులు సమకూరుతాయి. దీని వల్ల పిల్లల్లో సురక్షణ భావన ఏర్పడి దేన్నైనా సాధించేందుకు ఉద్యుక్తులవుతారు.

- **సురక్షితమైన అభ్యసన వాతావరణం :** అన్ని స్థాయిల్లో సురక్షిత వాతావరణం వల్ల దైనందిన అనుభవాలు అనేకం పిల్లల్లో ఏర్పడతాయి. దీనివల్ల సానుకూల సామాజిక దృక్పథం అలవడుతుంది. విద్యార్థులందరిలో నేర్పరితనం, సమర్థవంతమైన నైపుణ్యాలు పెంపొందుతాయి.

## 2. ప్రారంభ దశలో జోక్యం :

"మొక్కై వంగనిది మానై వంగునా" అని ఒక లోకోక్తి. పిల్లల గైర్హాజరును ప్రారంభంలోనే గుర్తించడం, బడి ఎగ్గొట్టడాన్ని కనిపెట్టడం జరిగితే విజయవంతమైన పాఠశాల అనుభవాలను వారిలో కలిగించవచ్చని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. ముందుగా గుర్తించడం వల్ల వారు దీనికి పూర్తిగా అలవాటు కాకముందే వారి వైఖరులను, ప్రవర్తన తీరును మార్చేందుకు ఆస్కారం ఉంటుంది. పాఠశాలలో విద్యార్థి కొనసాగినన్ని రోజులు ఈ వ్యూహం కొనసాగించడం సత్ఫలితాలు ఇస్తుంది.

- కుటుంబ జోక్యం : విద్యార్థి ప్రగతి సాధనలో కుటుంబ జోక్యం ప్రధాన పాత్ర పోషిస్తుంది. పాఠశాలలో విద్యార్థి విజయానికి ఇది ఊతంగా నిలుస్తుంది.
- పూర్వ ప్రాథమిక విద్య : డ్రాపౌట్ల సంఖ్యను తగ్గించేందుకు ప్రాథమిక దశ నుండి అభ్యసనానుభవాలను కలిగించడం, పూర్వ ప్రాథమిక విద్యను అందించడం ప్రధానమైనవి.
- వెనుకబడిన పిల్లలను ముందుగానే గుర్తించడం : తక్కువ ప్రగతి కనబరిచే పిల్లలపై శ్రద్ధ కనబరిచి; పఠన, లేఖన నైపుణ్యాలు వృద్ధి చెందేట్లు చేయడం అన్ని పాఠ్యాంశాల్లో సమర్థవంతమైన అభ్యసనానికి దారి తీస్తుంది.

## 3. ప్రత్యామ్నాయ పాఠశాలలు :

ప్రత్యామ్నాయ పాఠశాల విధానం బడి మానేసేందుకు ఆస్కారం ఉన్న పిల్లలు వారి చదువును పూర్తి చేసేందుకు ఊతమిస్తుంది. వారి సాంఘిక, విద్యాపర అవసరాలను దృష్టిలో ఉంచుకుని పాఠశాల విద్య పూర్తి చేసేందుకు ప్రత్యామ్నాయ పాఠశాలల విధానం దోహదపడుతుంది.

## 4. బడి వేళల అనంతరం చదివే అవకాశాలు :

చాలా పాఠశాలల్లో బడి వేళల అనంతరం కార్యక్రమాలు, వేసవి బడుల నిర్వహణ వల్ల పిల్లలు మర్చిపోయిన అంశాలను పునశ్చరణ చేసేందుకు అవకాశమేర్పడుతుంది. విభిన్న రంగాల్లో ఆసక్తిని కూడా రేకెత్తించవచ్చు. ఈ విధమైన అనుభవాలు జ్ఞాన నిర్మాణానికి దారి తీసి, అనుత్తీర్ణులవకుండా కాపాడతాయి.

## 5. వృత్తిపరమైన అభివృద్ధి :

ఉపాధ్యాయులు విద్యాపరమైన ఓటమి అంచుల్లో కొట్టుమిట్టాడే పిల్లలు, యువతతో నిరంతరం మెలుగుతుంటారు. వారి నైపుణ్యాలను పెంపొందింపజేసుకుని, సృజనాత్మక వికాసం చెందడానికి సహకారం అందజేయాలి.

**ప్రభుత్వం పాఠశాలలో నమోదును పెంచి, బడిలో పిల్లలు కొనసాగేలా చూడడానికి అనేక కార్యక్రమాలను ప్రవేశపెట్టింది. సెకండరీ విద్య పూర్తి చేయలేని వారి కోసం సాంకేతిక, వృత్తి విద్యలను; శిక్షణలను అందజేస్తోంది. మానవ వనరుల మంత్రిత్వ శాఖ, డైరెక్టరేట్ ఆఫ్ ఎడ్యుకేషన్, యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ వీటిని అమలు చేయడంతో పాటు విద్యావ్యాప్తిలో లింగ వివక్షకు అడ్డుకట్ట వేసేందుకు కృషి చేస్తున్నాయి. ప్రభుత్వ విధానాల్లో కొన్ని కింద ఇవ్వబడ్డాయి.**

- **జాతీయ యువజన విధానం, 1988:** దీన్ని 2003, 2012 సంవత్సరాల్లో సవరించారు. యువకులకు విద్యను అందజేయడానికున్న ప్రాధాన్యతను ఈ విధానం నొక్కిచెప్తోంది. లింగ వివక్ష లేకుండా బాలికలకు, మహిళలందరికీ విద్య అందజేయాలని చెప్తోంది. అక్షరాస్యతను పెంచేందుకు వీరిని ప్రాథమిక లక్ష్యంగా చేసుకోవాలని ఈ విధానం పేర్కొంటోంది. (యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ)

- **జాతీయ విద్యావిధానం, 1986:** దీన్ని అనంతరం 1992లో సవరించారు. అందరికీ విద్య అందించేందుకు ప్రభుత్వం కింది పథకాలను, కార్యక్రమాలను ప్రవేశపెట్టింది.
  - ఎలిమెంటరీ విద్య సార్వత్రీకరణకు కార్యాచరణ, 1992.
  - విద్యా హామీ పథకం, 1997-98.
  - సర్వశిక్షా అభియాన్ (ఎస్.ఎస్.ఎ.), 2001.
  - రాష్ట్రీయ మాధ్యమిక శిక్షా అభియాన్ (ఆర్.ఎం.ఎస్.ఎ.), 2008-09.
  - 86వ రాజ్యాంగ సవరణ
  - ఉచిత, నిర్బంధ విద్యా హక్కు చట్టం, 2010

- బడి మానేసే బాలికల కోసం ప్రభుత్వం రెండు పథకాలను ప్రవేశపెట్టింది. అవి : **నేషనల్ ప్రోగ్రామ్ ఫర్ గర్ల్స్ ఎడ్యుకేషన్ ఎట్ ది ఎలిమెంటరీ లెవెల్ (ఎన్.పి.ఇ.జి.ఇ.ఎల్.), కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు (కె.జి.బి.వి.).** ఈ రెండూ ప్రాథమికోన్నత స్థాయిలో బాలికల విద్యకు కృషి చేస్తున్నాయి.

కౌమారప్రాయంలోని వారిలో జీవన నైపుణ్యాలు, సాంఘిక విలువల ద్వారా సానుకూల దృక్పథం, ప్రవర్తన పెంపొందింపజేయాలి. లైంగికంగా, సాంఘికంగా కలిసిపోయేందుకు ప్రాధాన్యత కల్పించాలి. ఇలా చేయడం వల్ల వివాహం, వేధింపులు, బాల కార్మిక వ్యవస్థ, అక్రమ రవాణా మొదలైన వాటికి బాధితులు కాకుండా ఉంటారు.

నమోదు, కొనసాగడం, నాణ్యతలపై ప్రత్యేక దృష్టి పెట్టి విద్యావకాశాలను పెంపొందించడం వ్యక్తిగత, సమాజ అభివృద్ధికి ఊతమిస్తుంది. కాబట్టి విజయవంతమైన, ఆర్థికభారం లేని బోధనాభ్యసనకు మూల్యాంకనతో కూడిన నవీన కార్యక్రమాలు అవసరం.

## ఎన్.ఐ.ఓ.ఎస్. అంటే ఏమిటి?

కేంద్ర ప్రభుత్వ పరిధిలో గతంలో **నేషనల్ ఓపెన్ స్కూల్‌గా** గుర్తింపు పొందిన విద్యా బోర్డు **నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ (ఎన్.ఐ.ఓ.ఎస్.).** ఈ సంస్థను 1989 కేంద్ర ప్రభుత్వ మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసింది. అక్షరాస్యత పెంపొందించి, మారుమూల ప్రాంతాలకు విద్యను తేలికపాటి విధానాల్లో అందజేయడం ఈ సంస్థ లక్ష్యం. సి.బి.ఎస్.ఇ., ఐ.సి.ఎస్.ఇ. వంటి బోర్డులకు సమానమైన సార్వత్రిక పాఠశాలల సెకండరీ, సీనియర్ సెకండరీ పరీక్షలను ఈ సంస్థ నిర్వహిస్తుంది. ఉన్నత పాఠశాల దశ అనంతరం వృత్తివిద్యను కూడా అందజేస్తుంది. దూరవిద్య కోసం ఏర్పాటు చేసినప్పటికీ సి.బి.ఎస్.ఇ.తో సమానమైన నియత సెకండరీ, సీనియర్ సెకండరీ విద్యను కూడా నిర్వహిస్తోంది.

## ఎన్.ఐ.ఓ.ఎస్. ఏం చేస్తుంది?

ఔత్సాహిక అభ్యాసకులకు సార్వత్రిక, దూర విద్యా విధానంలో కింది కోర్సులను నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ (ఎన్.ఐ.ఓ.ఎస్.) నిర్వహిస్తుంది.

- 14 సంవత్సరాలకు పైబడిన కౌమార ప్రాయంలోని వారి కోసం, వయోజనులకోసం **ఓపెన్ బేసిక్ ఎడ్యుకేషన్ (ఓ.బి.ఇ.)** కార్యక్రమం. నియత పాఠశాల విధానంలోని 3వ, 5వ, 8వ తరగతులకు ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహించే ఎ, బి, సి స్థాయిలు సమానం.
- సెకండరీ ఎడ్యుకేషన్ కోర్సు
- సీనియర్ సెకండరీ ఎడ్యుకేషన్ కోర్సు
- వృత్తి విద్యా కోర్సులు
- జీవన విలువల పెంపుదల కార్యక్రమాలు

# విద్యాపరమైన కార్యక్రమాలు

### సెకండరీ కోర్సు :

ఈ కోర్సు పదవ తరగతికి సమానం. విభిన్న విషయాల నుండి సబ్జెక్టులను ఎంపిక చేసుకునే అవకాశం ఉంది. అయితే కనీసం ఐదు సబ్జెక్టులను పూర్తి చేయడం వల్ల సర్టిఫికెట్ లభిస్తుంది.

### సీనియర్ సెకండరీ కోర్సు :

పదో తరగతి లేదా సమానమైన పరీక్షను గుర్తించబడిన బోర్డునుండి ఉత్తీర్ణులై, చదువును కొనసాగించాలనుకునేవారు 12 వ తరగతి లేదా ఇంటర్మీడియట్‌కు సమానమైన ఈ కోర్సు చదవవచ్చు. విభిన్న విషయాల నుండి సబ్జెక్టులను ఎంపిక చేసుకునే అవకాశం ఉంది. అయితే కనీసం ఐదు సబ్జెక్టులను పూర్తి చేయడం వల్ల సర్టిఫికెట్ లభిస్తుంది.

# అడ్మిషన్ విధానం

2010-11 సంవత్సరం నుండి 100 శాతం ఆన్‌లైన్ ప్రవేశ విధానాన్ని ఎన్.ఐ.ఓ.ఎస్. అమలులోకి తెచ్చింది. దీని ద్వారా అభ్యాసకులు రిజిస్టర్ చేసుకోవచ్చు. ఈ పథకం కింద నమోదు అభ్యాసకులు కింది పద్ధతుల్లో చేసుకోవచ్చు.

- ఆన్‌లైన్‌లో నేరుగా నమోదు చేసుకోవడం.
- సమీపంలోని అధ్యయన కేంద్రాన్ని సందర్శించి, ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ విషయంలో సహాయం తీసుకోవచ్చు.
- ప్రాంతీయ కేంద్రం ద్వారా కూడా ఆన్‌లైన్‌లో నమోదును పూర్తి చేయవచ్చు.

**ప్రవేశపద్ధతిని సులభతరం చేసేందుకు నిరంతరం 24×7 ఆన్‌లైన్ అడ్మిషన్ సదుపాయం ఉంది.**

- ఎన్.ఐ.ఓ.ఎస్. ఆన్‌లైన్ (చీఱ-ూఅ) ప్రాజెక్టు

**అసంపూర్తిగా ఉన్న దరఖాస్తులను తిరస్కరిస్తారు.**

- **అర్హత:** కనీస విద్యార్హత

- **సెకండరీ కోర్సు** : ఎనిమిదో తరగతి ఉత్తీర్ణులైన సర్టిఫికెట్ లేదా స్వీయ ధృవీకరణ (ప్రవేశ పత్రం వెనుకవైపు ఉన్న విధంగా)

- **సీనియర్ సెకండరీ కోర్సు** : గుర్తించబడిన సెకండరీ విద్యాబోర్డు నుండి సెకండరీ పరీక్ష ఉత్తీర్ణులైన ధృవీకరణ పత్రం. దీన్ని గెజిటెడ్ అధికారి అటెస్టేషన్ చేయాలి.

అవసరమైన పత్రాలు జతపర్చని ప్రవేశపత్రాలను తిరస్కరిస్తారు. ఫీజును కూడా వాపసు చేయరు.

**2014 నుండి విశాఖపట్నంలోని ఎన్.ఐ.ఓ.ఎస్.కు చెందిన ఎస్.ఆర్.సి. పూర్తి స్థాయి ప్రాంతీయ కేంద్రంగా అప్‌గ్రేడ్ అయింది. ప్రస్తుతం దీని పరిధిలో 13 జిల్లాలు ఉన్నాయి.**

- గుర్తించబడిన బోర్డు నుండి సెకండరీ స్థాయి పరీక్ష ఉత్తీర్ణులు కాకపోతే సీనియర్ సెకండరీ స్థాయిలో అడ్మిషన్ నిరాకరిస్తారు.

- ఏదైనా విదేశీ బోర్డు లేదా విశ్వ విద్యాలయం నుండి సెకండరీ సర్టిఫికెట్ ఉండి, ఎన్.ఐ.ఓ.ఎస్.లో సీనియర్ సెకండరీ కోర్సులో అడ్మిషన్ తీసుకోవాలనుకుంటే సంబంధిత రాయబార కార్యాలయం నుండి ఆ సర్టిఫికెట్ భారతీయ సెకండరీ పరీక్షకు సమానమనే ధృవీకరణ పత్రాన్ని జతపర్చవలసి ఉంటుంది.

## ఉపయుక్త ఆధారాలు


http://www.academics-india.com/npe86-mod92.pdf ª%

http://ssa.nic.in/girls-education/npegel/npegl.pdf/view

http://www.gnu.org/education/edu-system-india.en.html

http://www.dnaindia.com/india/report-more-boys-than-girls-dropping-out-of-schools-in-india-2112206

https://www.saddahaq.com/modi-is-right-to-stop-school-dropouts-fix-the-toilets

http://www.slideshare.net/mobile/prinson/understanding-child-protection-cp-and-cp-mechanisms-in-india

https://www.savethechildren.in/what-we-do/child-protection.html

http://www.childlineindia.org.in/child-protection-child-rights-india.htm

http://www.girlsnotbrides.org/child-marriage-in-nepal-what-about-girls/

http://www.pacsindia.org/projects/advocacy-and-campaigning/child-marriage-campaign

http://unicef.in/Whatwedo/30/Child-Marriage

http://www.countercurrents.org/pagadala121112.htm

http://www.womensweb.in/articles/child-marriages-andhra-pradesh/

https://books.google.co.in/books?role+play+for+child+marriage

http://www.slideshare.net/mobile/Marieum1/child-marriage-in-india

http://www.slideshare.net/mobile/khushbo0/socio-psychological-effect-of-early-marriages

https://www.hrw.org/news/2013/06/14/q-child-marriage-and-violations-girls-rights

http://www.pbs.org/now/shows/341/educators.html

cbps.in/wp-content/uploads/Child-Marraige-UNICEF.pdf

https://www.unfpa.org/

www.icrw.org

## Notes

## *Notes*

# Notes

## *Notes*

## *Notes*